Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు
rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 147 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
ఆదివారం, 11 - 1 - 2026
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## అయోధ్యలో భద్రతా వైఫల్యం..కశ్మీర్ యువకుడి నిర్బంధం



**అయోధ్య:** అయోధ్య రామాలయం క్లాంప్లెక్స్‌లో భద్రతా వైఫల్యం చోటు చేసుకుంది. కాంప్లెక్స్ ఆవరణలో నమాజ్ చేసేందుకు ప్రయత్నించిన కశ్మీర్ యువకుడిని భద్రతా సిబ్బంది శనివారం నాడు అదుపులోనికి తీసుకున్నట్టు తెలుస్తోంది. కాంప్లెక్స్‌లోని దక్షిణ గోడల ప్రాంతం వద్ద ఉన్న సీతాదేవి వంటగది సమీపంలో ఆ యువకుడు నమాజ్‌కు ప్రయత్నించి నట్టు సమాచారం. కశ్మీరీ సంప్రదాయ దుస్తులు ధరించిన యువకుడు గేట్ డీ1 ద్వారా రామాలయంలోకి ప్రవేశించాడు. అతనిని కశ్మీర్‌లోని షోపియాన్ నివాసి అహ్మద్ షేక్‌గా గుర్తించారు. అతన్ని ఆపేందుకు ప్రయత్నించగా ఒక మతానికి చెందిన వ్యక్తుల సపోర్ట్ కోరుతూ నినాదాలు చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం అతన్ని భద్రతా సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. కాగా, ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం ఇంత వరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు. రామాలయం ట్రస్టు సైతం వెంటనే స్పందించలేదు. మరోవైపు, రామాలయానికి 15 కిలో మీటర్లలోపు నాన్-వెజిటేరియన్ ఆహారాన్ని సరఫరా చేయరాదంటూ జిల్లా యంత్రాంగం శుక్రవారం నాడు ఒక అధికారిక ప్రకటన చేసింది. అతిథులకు నాన్‌వెజిటేరియన్ ఆహారం, ఆల్కహాలిక్ డ్రింకులు సరఫరా చేయరాదని హోటళ్లు, వసతి గృహాలకు హెచ్చరికలు చేసింది. ఆన్‌లైన్ ఆర్డర్ ఇచ్చిన టూరిస్టులకు నాన్‌వెజ్ సరఫరా చేస్తున్నట్టు తమకు సమాచారం అందడంతో రామాలయం, సమీప ప్రాంతాల్లో ఆన్‌లైన్ డెలివరీపై నిషేధం విధించామని అసిస్టెంట్ ఫుడ్ కమిషనర్ మాణిక్ చంద్రసింగ్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



**రాష్ట్ర రాజధాని అమరావతి వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) డైరీని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలువు పార్థసారథి, చిత్రంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, ఫెడరేషన్ నాయకులు ఎం.బి.నాథన్, రాఘవేంద్ర శేఖర్, ఎపిబిజెఎ నాయకులు వీసం శ్రీనివాస్ తదితరులు**

## కిడ్నీ బాధితుల సంక్షేమానికి అండగా కేశినేని ఫౌండేషన్ ముందడుగు



**ఎన్టీఆర్ జిల్లా, (రాజధాని వార్తలు):** కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సరైన పోషణే అత్యంత కీలకమని టీడీపీ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వ్యాఖ్యానించారు. శనివారం కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరువూరు నియోజకవర్గంలోని కిడ్నీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఏ కొండూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కిడ్నీ బాధితులు, డయాలసిస్ పేషంట్లకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమంలో ఎంపీ శివనాథ్, జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, ఆర్డీఓ మాధురి, కూటమి నేతలు పాల్గొన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్థులకు నెల రోజులకు సరిపోయే విధంగా మరమరాలు, నువ్వుల ఉండలు, అటుకులు, జొన్న పిండితో చేసిన పౌష్టికాహార కిట్స్ పంపిణీ చేశారు. కలెక్టర్ లక్ష్మీషా, ఆర్డీఓ మాధురితో కలిసి ఎంపీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడారు. పౌష్టికాహారం అందించడం ద్వారా చికిత్సకు తోడ్పాటుగా ఉండడంతో పాటూ ఆరోగ్యం మెరుగుపడు తుందని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా పౌష్టికాహారం పంపిణీ చేస్తామని ఎంపీ శివనాథ్ పేర్కొన్నారు.

## ఎట్టకేలకు అదుపులోకి బ్లోఅవుట్ మంటలు.. ఊపిరి పీల్చుకున్న ప్రజలు




**అమరావతి, (రాజధాని వార్తలు):** డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండ వద్ద బ్లోఅవుట్ మంటలు అదుపులోకి రావటంపై మంత్రి అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఓఎన్జీసీ వేల్‌కు బీఓపీ ఫిక్స్ చేసిన ఓఎన్జీసీ అధికారులను మంత్రి అభినందించారు. ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం శకలాలను పూర్తిగా తొలగించిందని.. పూర్తి దేశీయ పరిజ్ఞానంతోనే ఓఎన్జీసీ సిబ్బంది మంటలార్పిందని తెలిపారు. అతి తక్కువ సమయంలోనే ప్రమాదాన్ని నియంత్రించి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని ఆయన తెలిపారు. కష్ట సమయంలో సమర్థవంతంగా పని చేసిన అధికారుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

**జరిగింది ఇదీ..**

మలికిపురం మండలం ఇరుసుమండ సమీపంలో ఈనెల 5న (జనవరి) ఓఎన్జీసీ యాజమాన్యంలోని మోరి-5 బావిలో గ్యాస్ లీక్ కారణంగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దాదాపు 20 మీటర్ల ఎత్తున భారీ అగ్నికీలలు ఎగిసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటల నేపథ్యంలో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామాలకు చెందిన సుమారు 500- 600 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు అధికారులు. కాగా, ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. జిల్లా అధికారులు, ఓఎన్జీసీని సమన్వయం చేసి మంటలను అదుపు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు మంటలను అధికారులు అదుపులోకి తెచ్చారు. మరోవైపు మంత్రి అచ్చెన్నాయుడు ఘటనా స్థలాన్ని సందర్శించి, బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించారు. ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం, ఢిల్లీ, ముంబై నుంచి వచ్చిన నిపుణులు, స్థానిక అగ్నిమాపక దళాలు కలిసి మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారు. నీటి గొడుగు, కూలెంట్ ద్రవాలు, డెబ్రిస్ తొలగింపు వంటి చర్యలతో మంటల తీవ్రత తగ్గించారు. చివరకు ఈరోజు (జనవరి 10) ఉదయానికి మంటలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. బ్లోఅవుట్ పూర్తిగా అదుపులోకి వచ్చింది.

**సంబరాలు..**

బ్లో అవుట్ అదుపులోకి రావటంతో ఓఎన్జీసీ నిపుణులు సంబరాలు చేసుకున్నారు. బ్లోఅవుట్ ప్రాంతంలో స్వీట్స్ తినిపించుకుని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే బ్లోఅవుట్ అదుపులోకి రావటంతో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామ ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇకపై ఓఎన్జీసీ కార్యకలాపాలు పూర్తిగా నిలిపి వేయాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నదీ గర్భానికి, నదీ పరివాహక ప్రాంతానికి తేడా తెలియని వ్యక్తి జగన్ : సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీరును మరోసారి తప్పుబట్టారు సీఎం చంద్రబాబు. నదులు ఎక్కడ పుడతాయో, నాగరికత ఎక్కడ మొదలైందో జగన్‌కి తెలియదని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ కు కనీసం సింధూ నాగరికత గురించి కూడా అవగాహన లేదని మండిపడ్డారు. నదీగర్భానికి, నదీ పరివాహక ప్రాంతానికి తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. దేశ రాజధాని ఢిల్లీ సహా ప్రధాన నగరాలు నదీతీరాల వెంబడి ఉన్నందునే అభివృద్ధి చెందాయని అన్నారు. అంతేకాదు లండన్ సహా ప్రపంచంలోని ప్రముఖ నగరాలు నదీ పరివాహక ప్రాంతంలోనే ఉన్నట్లు చెప్పుకొచ్చారు. ప్రజలు బుద్ధి చెప్పినా.. రాజధానిపై ఇప్ప టికీ విషం చిమ్ముతూనే ఉన్నారని జగన్‌పై నిప్పులు చెరిగారు చంద్రబాబు. 'ఏపీలో రానున్న రెండేళ్లలో నీటి కొరత లేకుండా ప్రణాళికలు రూపొందించాం. దేశంలోనే ఉద్యానవన రంగంలో అగ్రస్థానంలో ఉన్నాం. రానున్న పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్-1గా నిలుస్తాం. దేశంలో ప్రతి రాష్ట్రం మనల్ని చూసి నేర్చుకునేలా ముందుకు సాగుతాం. నీటి విషయంలో గొడవలకు పోతే నష్టపోయేది తెలుగు ప్రజలే. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు బాగుండాలనుకోవడం తప్పా?. మిగులు జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయన్న విషయం ఆయనకి అర్థం కావడం లేదు. రాయలసీమకు నీరు అందించామనడానికి పట్టిసీమే ప్రత్యక్ష ఉదాహరణ. పట్టిసీమ ద్వారా రాయలసీమపై మాకున్న చిత్తశుద్ధిని చాటుకున్నాం. అందుకే ప్రజలు మా పాలన కోరుకున్నారు. పట్టిసీమ వల్లే రాయలసీమలో ఉద్యానరంగం అభివృద్ధి పూర్తి చేయకుండా 2020లోనే నిలిపి వేశారు. రాయలసీమ లిఫ్ట్ పేరుతో స్వార్థ రాజకీయాలు చేస్తున్నారు. కేవలం మట్టి పనులు చేసి రూ.900 కోట్లు బిల్లులు క్లయిమ్ చేసుకున్నారంటే ఆ ప్రభుత్వంలో దోపిడి ఏ విధంగా జరిగిందన్న విషయం ప్రజలు గమనించారు. రాయలసీమను రత్నాల సీమగా మార్చే సత్తా మాకుంది. తెలంగాణతో మాకు ఉన్న సమస్యలు పరిష్కరించుకుంటాం. రాజకీయాల కోసం సెంటిమెంట్లు రెచ్చగొట్టం' అని సీఎం చంద్రబాబు చెప్పారు.

## రాజధానిపై బురద జల్లే ప్రయత్నం... సజ్జలపై మంత్రి నారాయణ ఫైర్




**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతిపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలకు మంత్రి నారాయణ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం నాడు ఉండవల్లిలోని సీఎం క్యాంప్ ఆఫీసు వద్ద మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. వైసీపీ దృష్టిలో రాష్ట్ర రాజధాని ఎక్కడో చెప్పాలన్నారు. అమరావతి రాజధాని అని తమకు పూర్తి క్లారిటీ ఉందని.. వైసీపీ కూడా రాజధానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రివర్ బెడ్‌కు రివర్ బేసిన్‌కు తేడా తెలియకుండా మాట్లాడారని వ్యాఖ్యలు చేశారు. చాలా నగరాలు రివర్ బేసిన్‌లోనే మహా నగరాలుగా అభివృద్ధి చెందాయని మంత్రి తెలిపారు. రైతులతో మాట్లాడటానికి ఇష్టపడని నాయకులు ఇప్పుడు లేనిపోని ప్రేమ చూపిస్తారని మంత్రి నారాయణ మండిపడ్డారు. గత ప్రభుత్వ నిర్వాకంతోనే అమరావతి పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయని విమర్శలు గుప్పించారు. అమరావతి నిర్మాణ పనులకు పారదర్శకంగా టెండర్లు పిలిచామని స్పష్టం చేశారు. రాజధానిపై బురద జల్లే ఉద్దేశంతో అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సెక్రటేరియట్‌లో కేవలం మంత్రులు, వారి శాఖలు, అధికారులు మాత్రమే ఉండేలా నిర్మించారన్నారు. కానీ అమరావతిలో నిర్మించే సెక్రటేరియట్‌లో మంత్రులు, సిబ్బంది, హెచ్‌వోడీలు, ఇతర కార్పొరేషన్లు అన్నీ ఒకేచోట ఉండేలా నిర్మిస్తున్నామని వివరించారు. ప్రజలకు పాలన దగ్గరగా ఉండే విధంగా అన్ని నిర్మాణాలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాజధానిపై మాట్లాడే ముందు జగన్ స్టడీ చేసి మాట్లాడాలని మంత్రి నారాయణ హితవు పలికారు.

## అపరభగీరథుడు చంద్రబాబు.. అతిపెద్ద దొంగ జగన్



**పెనుకొండ (అనంతపురం), (రాజధాని వార్తలు):** సీఎం చంద్రబాబు అపరభగీరథుడని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. జగన్ అతిపెద్ద దొంగ అని మండిపడ్డారు. పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ అన్ని వ్యవస్థలను నాశనం చేసి, వేలకోట్లు దోచుకున్న అతిపెద్ద దొంగ అని విమర్శించారు. రాయలసీమకు తీరని ద్రోహం చేసిన ఆయన, దయ్యాలు వేదాలు వల్లించినట్లు కూటమి ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని అన్నారు. తాడేపల్లిలో ఇంటిని నిర్మించుకుని అమరావతే రాజధాని అని అక్కడి ప్రజలను నమ్మించారని, అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారని విమర్శించారు. ఐదేళ్లపాటు రాజధాని లేకుండా పాలించిన ఘనుడు జగన్ అని ఎద్దేవా చేశారు. ప్రజాధనాన్ని దోచుకోవడానికి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పేరుతో జగన్ పెద్ద కుట్రకు తెరలేపారని అన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను కాంట్రాక్టు సంస్థకు అప్పగించారని, రూ.900 కోట్లు ఖర్చు చేశారని అన్నారు. ఎత్తిపోతల పథకం పేరుతో రూ.2,745 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారని మండిపడ్డారు. అక్రమార్జన కోసం రాయలసీమకు, రాష్ట్ర ప్రజలకు జగన్ తీరని ద్రోహం చేశారని అన్నారు. రాయలసీమపై జగన్‌కు నిజమైన ప్రేమ ఉంటే 18 నెలల నుంచి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఇన్నాళ్లు ఎందుకు గుర్తు రాలేదని ప్రశ్నించారు. రాజకీయ ఉనికి కోసం తెలంగాణ రాజకీయ పార్టీలు సీఎం చంద్రబాబు పేరును వాడుకుంటున్నాయని, జగన్ తప్పుడు ఆరోపణలతో విషం కక్కుతున్నారని మంత్రి మండిపడ్డారు. రాయలసీమకు తాగు, సాగునీరు అందించిన ఘనత సీఎం చంద్రబాబుదేనని అన్నారు. ఎన్ని బెదిరింపులకు పాల్పడినా అమరావతిని నిర్మించి తీరుతామని అన్నారు.

# "మనిషిలోని పరిపూర్ణతను ఆవిష్కరించేదే అసలైన విద్య"

## - (జనవరి 10వ తేదీన గుంటూరు జిల్లా సీతానగరంలోని రామకృష్ణ మిషన్ స్కూల్ వజ్రోత్సవ వేడుకల సందర్భంగా)

"మాతేవ రక్షత పితేవ హితే నియుక్తే
కాంతేవ చాభి రమయత్య పనీయ ఖేదమ్
లక్ష్మం తనోతి వితనోతిచ దిక్ష కీర్తిం
కింకిం న సాధయతి కల్పలతేవ విద్యా"

'విద్య తల్లిలా రక్షిస్తుంది. తండ్రిలా పాలిస్తుంది. మనసైన వారిలా సంతోషపెడుతుంది. ఐశ్వర్యాన్ని, కీర్తిని పెంచుతుంది. కల్పవృక్షంలా సమస్తం సమకూర్చుతుంది.' అని పై పద్యానికి అర్థం. విద్య – ఒక అనంత ప్రయాణం. చీకటి నుంచి వెలుగులోకి సాగే మార్గం. లోపాల్ని సరిదిద్ది, భవిష్యత్‌కు బాటలు వేసి, వినయ పరిమళాలు వెదజల్లి సమానత్వ సమాజ సౌధాన్ని నిర్మించేదే చదువంటే. "మనిషిలోని పరిపూర్ణతను ఆవిష్కరించేదే అసలైన విద్య" అన్న స్వామీ వివేకానంద మాటే బాటగా సమాజంలో లాభాపేక్ష లేకుండా నిస్వార్థ సేవా మార్గంలో విద్యా వ్యాప్తి చేయాలనే ఓ నిబద్ధతగల ఆలోచనతో 6 దశాబ్దాల కిందట ఆరంభించినదే రామకృష్ణ మిషన్ స్కూల్. 60 ఏళ్ల తన ప్రస్థానంలో వేల మంది విద్యార్థులను ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టి, చదివిన ప్రతి ఒక్కరినీ పరిపూర్ణమైన మనుషులుగా నిలబెట్టి నేడు సగర్వంగా వజ్రోత్సవ వేడుకలు జరుపుకుంటోంది. క్రమశిక్షణ, అకుంఠిత దీక్షకు తోడు అత్యుత్తమ విధానాలు, విలువైన సిద్ధాంతాలతో నేడు శిఖరాగ్రాన నిలిచింది. 1965వ సంవత్సరంలో కృష్ణానదికి ఆనుకుని ఉన్న సీతానగరం గ్రామంలో ఎటు చూసిన కంప చెట్లు. చుట్టూ పాములు, తేళ్ల వంటి విష ప్రాణులు సంచరిస్తూ భయంకరమైన అడవిని తలపించేలా ఉన్న ప్రాంతంలో ఒక చిన్న పూరి పాక. అందునా ఒకే ఒక గది. ఇవి చాలదన్నట్లు దొంగల బెడద, క్వారీ కూలీలు, రిక్ష కార్మికులుగా కటిక దారిద్ర్యంతో జీవించే చిన్న ఊరిలో 56 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులు, 6, 7 తరగతులతో మాత్రమే రామకృష్ణ విద్యాలయం కమల కుసుమంలా వికసించింది. బమ్మెర పోతనామాత్యులు చెప్పినట్లు ఇంతింతై వటుడింతై అన్న రీతిలో దినదిన ప్రవర్ధమానమై ఎన్నో జీవితాల్లో వెలుగులు నింపింది.. మనిషిని మనీషిగా తీర్చిదిద్దుతూ మరెన్నో కుటుంబాల్లో మానవత్వపు పరిమళాలను నింపుతోంది. 'జీవారాధనే శివారాధన' అని బోధించిన అవతారమూర్తి శ్రీ రామకృష్ణులవారి దిశానిర్దేశంలో రామకృష్ణ సంఘాలు ఈ బృహత్ కార్యాన్ని నాడు తమ భుజాలపై వేసుకున్నాయి. సంఘ జనని శారదాదేవి మాతృవాత్సల్యంతో సంఘటితమై ఒక గొప్ప ఆలోచనకు శ్రీరామకృష్ణ సమితి ద్వారా 1956లో బీజం పడింది. ఆనాడు..శ్రీరామకృష్ణ సమితి కార్యదర్శి పెనుమత్స బాపిరాజు, వ్యవస్థాపక అధ్యక్షలు వంగా తాతారావు, గౌరవాధ్యక్షలు అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ కె.యల్. రావు ప్రకాశం బ్యారేజీ కొండను ఆనుకుని ఉన్న కృష్ణా పరివాహక ప్రాంతంలో 18 ఎకరాల సువిశాల ప్రాంగణంలో రామకృష్ణ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. 1969లో రామకృష్ణ మఠ ప్రధాన కార్యదర్శి స్వామి గంభీరానందజీ మహరాజ్ వారు ఈ పాఠశాలను సందర్శించి అనుగ్రహ భాషణం చేశారు. శ్రీమత్ తపస్యానందజీ, శ్రీమత్ స్వామి ఆత్మస్థానందజీ, శ్రీమత్ స్వామి గౌతమానందజీ, శ్రీమత్ సుహితానందజీ, శ్రీమత్ సర్వగతానందజీ, శ్రీమత్ స్వామి గహనానందజీ, శ్రీమత్ స్వామి ప్రమేయానందజీ, శ్రీమత్ స్వామీ స్థితికంఠానందజీ (ప్రస్తుతం).. ఇలా అనేక మంది స్వామీజీల సందర్శనలు, ప్రవచనాల మార్గనిర్దేశంలో ఈ పాఠశాల విద్యాసుగంధాలు వెదజల్లుతోంది. 2001లో బేలూరు రామకృష్ణ మిషన్ వారు ఈ పాఠశాలను చేపట్టి విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తూ , వారు ఎంచుకున్న రంగాలలో మానవీయ కోణంలో విధులు నిర్వర్తించేందుకు అవసరమైన మానసిక, శారీరక శిక్షణ కల్పిస్తూ భావిభారత పౌరులను పరిపూర్ణ మనుష్యులుగా మలిచేందుకు కృషి చేస్తోంది. పాఠశాల ప్రారంభించిన తొలినాళ్లలో కనీస అవసరాలు తీర్చుకోవడానికి కూడా కావల్సిన ఆర్థిక వనరులు సమకూర్చుకోలేని గడ్డుపరిస్థితి. దీంతో శ్రీరామకృష్ణులు, వివేకానంద జీవిత చరిత్ర మొదలైన బెంగాలీ, హిందీ సినిమాలు ప్రతి ఆదివారం రాష్ట్రంలో ఏదో ఒకచోట ప్రదర్శిస్తూ..ఆ వచ్చిన సొమ్ముతోనే విద్యాలయాన్ని నడిపించాల్సిన దయనీయరోజులను దాటింది. గాలివానలకు పాఠశాల పైకప్పులు ఎగిరిపోతే చిన్నారులు, ఉపాధ్యాయులు కలిసికట్టుగా పునరుద్ధరించుకుంటూ ఆ కష్టాలను తట్టుకుంది. ఇలా ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చి..నేడు 12వేల మంది విద్యార్థుల భవితను తీర్చిదిద్ది.. మహావృక్షంలా ఎందరికో నీడనిస్తూ అందనంత ఎత్తుకు చేరి నేడు నిటారుగా నిలుచుంది.

రామకృష్ణ మిషన్ ప్రస్థానంలో మలుపులు, మెరుపులు ఎన్నో..మరెన్నెన్నో! సాహసంతో పాఠశాలను ఏర్పాటు చేయడం ఒక ఎత్తయితే..ఆ మూర్తిత్రయం ఆశీస్సులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల పట్టుదలతో ప్రాణాలకు తెగించి పాఠశాలను నడపించుకోవడం మరో ఎత్తు. నాణ్యమైన విద్యను, సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దే ప్రజ్ఞపాటవాలుగల ఉపాధ్యాయుల కృషితో అచిరకాలంలోనే ప్రగతిబాట పట్టింది. అందుకే కేవలం యాభై ఆరు మంది విద్యార్థులతో మొదలై 1969 నాటికి 150, 1973 నాటికి 700, 1996 నాటికి 1000 మంది విద్యార్థులతో చదవులో మంచి ఫలితాలు సాధిస్తూ ముందడుగు వేస్తోంది. వ్యాయామం సహా సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ విద్య వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో కూడా పాఠశాలలో విద్యార్థులకు సీటు దొరకడమే కష్టమనేంత స్థాయిలో పోటీగా నిలిచి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుత సమాజంలో విద్య వ్యాపారంగా మారింది. చదువంటే అంగడి వస్తువు అయిపోయింది. మార్కులు, గ్రేడులు, ర్యాంకులే కొలమానంగా మారిపోయాయి. కానీ ఇటువంటి సమాజంలోనూ శీలం, మానసిక బలం, వివేకం పెంపొందించాలనే వివేకానంద ఆశయాలకు అనుగుణంగా నడవబడుతుండడం ఆదర్శనీయం. అన్ని తరగతుల పిల్లల అవసరాలు తీర్చే పుస్తకాలయం, పాఠ్యాంశాలను క్షణ్ణంగా పరిశీలించి తెలుసుకునే ప్రయోగశాల, విశాలమైన ఆటస్థలం వంటి వసతులకు కొదవ లేదు.

**సేవా కార్యక్రమాలకు పెద్దపీట**

48 ఏళ్ల క్రితం, జలప్రళయంగా మారిన దివిసీమ ఉప్పెనలో పునరావాస కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మేము సైతం అంటూ భాగస్వామ్యం కావడం ప్రశంసనీయం. పాఠశాల ఆరంభం దగ్గర నుంచి గత సెప్టెంబర్‌లో విజయవాడకు దడ పుట్టించిన వరదల వరకు తుపానులు, క్షమం, భూకంపాల వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో రామకృష్ణ మిషన్ అందించిన సేవలు అనన్యసామాన్యం. విపత్తులప్పుడు పాఠశాలను పునరావాస కేంద్రంగా మార్చడం సహా వందల మందికి ఆకలి తీర్చడం మిషన్ సేవా తత్పరతకు నిదర్శనం. రామకృష్ణ మిషన్ ఓ జీవనది. రామకృష్ణులు, వివేకానంద త్యాగ, సేవాపూరిత భావాలకు ఆకర్షితులై వేలాదిమంది సేవా కార్యక్రమాల్లో మమేకమవడం నిత్యనూతనం. ప్రతి బుధవారం హోమియోపతి వైద్యశిబిరం నిర్వహణ, ప్రతి నెలా ఆధ్యాత్మిక శిబిరం, ప్రతి నెలా వైద్య నిపుణులతో గ్రామస్థులకు వైద్యపరీక్షలు, జపయజ్ఞం, పేద వృద్ధులకు ఉచితంగా నిత్యావసరాల పంపిణీ, ప్రతి యేటా వేసవిలో మజ్జిగ పంపిణీ ఇలా లెక్కలేనన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రామకృష్ణ మిషన్ సామాజిక బాధ్యతను చాటుతోంది. 2001లో గుజరాత్‌లో భూకంపం, 2005 తమిళనాడులో సునామీ, 2008లో బీహార్‌లో వరదలు, 2009లో పశ్చిమ బెంగాల్‌లో ఐలా తుపాను, 2015లో నేపాల్‌లో భూకంపం, 2016లో చెన్నై వరదలు సహా దేశంలో ఎక్కడ ఏ విపత్తు సంభవించినా ప్రజల నుండి విరాళాలు సేకరించి సేవా కార్యక్రమాలు నిర్వహించింది. విద్య, వైద్య రంగాలకు రూ. వందల కోట్ల రూపాయాలు ఖర్చుపెట్టి విశిష్ట సేవలందించబడ్డాయి.

1996లో తూర్పుగోదావరి జిల్లాలో సంభవించిన తుపాను వల్ల లంక గ్రామాల రాకపోకలు స్తంభించాయి. ఆ సమయంలో వృద్ధగౌతమి నదీపాయపై పళ్లావారిపా లెం- లంక ఆఫ్ ఠానే లంకల మధ్యన సగం ప్రభుత్వం నిధులు మిగతాది మిషన్ వారు కలిసి రూ.3.5 కోట్ల నిధులు మంజూరై రూ.3 కోట్లతోనే 'వివేకనంద వారధి' నిర్మించడం మిషన్ పార దర్శకత, నియమనిబద్ధతకు నిదర్శనం. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు పై చదువుల నిమిత్తం నగదు బహుమతులు, ఆర్థిక స్తోమత లేని వారికి ఉచితంగా స్కూలు యూనిఫాం, రాసుకునే పుస్తకాలు అందజేయడం అక్కడ సర్వసాధారణం. పిల్లలకు భజనలు, భారతీయ సంస్కృతి, విలువలు అలవరిచే కథలు, ఆటల నిర్వహణ ఇక్కడ కాక మరెక్కడా మనకు కానరావు. ప్రతి రోజూ ప్రార్థనా సమావేశంలో నైతిక విలువలు పెంపొందించే విషయాలను బోధించడం, స్వామీజీల పర్యవేక్షణతో విద్యార్థులకు శిక్షణ, విజ్ఞానయాత్రల నిర్వహణ, వ్యక్తిత్వ వికాస తరగతులు, వివేక వాహిని, వ్యవస్థాపక దినోత్సవం జరపడం, వివిధ వైద్య శిబిరాల ఏర్పాటుతో ఉచిత చికిత్స మిషన్ సేవలో భాగం.

**ఎంతో మార్పు..ప్రతి మార్పు పగ్రతి వైపు**

విద్యార్థుల మొదటి గురువు తల్లి. తర్వాత తండ్రి. ఆ తర్వాతే విద్య నేర్పే గురువు. ఈ విషయాన్ని రామకృష్ణ మిషన్ తుచ తప్పక పాటిస్తోంది. చిన్నారుల చెడు అలవాట్లను, సహజ పొరపాట్లను సరిచేయడంలో తల్లిదండ్రుల సహకారం తీసుకుంటూ వారిని సమర్థవంతులుగా మలచడానికి సర్వప్రయత్నాలు చేస్తోంది. చిన్నారుల్లో వ్యక్తిత్వ వికాసం కోసం అడుగడుగునా పాటుపడుతోంది.

**చదవుతో పాటు సంస్కృతి, సంస్కారం పెంపొందించడంపై దృష్టి**

గత ఏడాది కాలంగా చదువుతో పాటు ప్రస్తుత కాలానికి అవశ్యమైన చిన్నారుల శారీరక, మానసిక దృఢంగా మార్చడమే కాకుండా సంస్కారం, మానవత్వం, స్పందించే హృదయాలుగా తీర్చిదిద్దే దిశగా బలమైన అడుగులు పడుతున్నాయి. ఆటలు, భక్తి, దేశభక్తి పాటలు, కరాటే, భరతనాట్యం, యోగా, శ్లోక పఠనం, చేతివృత్తులు, పద్యాలు, భజన, వంటి కార్యక్రమాలకు పెద్దపీట వేయడం వైవిధ్యమైన అంశం. వార్షికోత్సవ వేడుకలు సైతం మన సంస్కృతి ప్రతిబింబించే కార్యక్రమాలకే ప్రాధాన్యతనివ్వడం ఆహ్వానించదగ్గ పరిణామం. విద్యార్థులకు నామమాత్రపు ఫీజుతో విద్యనందించడాన్ని ఒక బృహత్ బాధ్యతగా నిర్వర్తించడంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిది. అందుకే పాఠశాల స్థాపించిన నాటి నుంచి ఇక్కడ చదివి వెళ్లిన విద్యార్థుల వివరాలు సేకరించి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పూర్వ విద్యార్థుల సంఘం ఆధర్వర్యంలోనే డైమండ్ జూబిలీ వేడుకలకు రామకృష్ణ మిషన్ సిద్ధమైంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలో రామకృష్ణ మిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం 2 ఎకరాల భూమిని కేటాయించగా.. ఇటీవల వార్షికోత్సవ వేడుకల నిమిత్తం వచ్చిన రామకృష్ణ మఠం వైస్ ప్రెసిడెంట్ స్వామి సుహితానందజీ మహారాజ్ చేతుల మీదుగా అమరావతిలో రామకృష్ణ మిషన్ ఏర్పాటుకు భూమి పూజ పూర్తయింది. వచ్చే ఫిబ్రవరి 1వ తేదీన స్వామి అద్భుతానందజీ జయంతి సందర్భంగా విజయవాడ గాంధీనగర్‌లో శ్రీమత్ గౌతమానందజీ చేతుల మీదుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో రామకృష్ణ మిషన్ వారు అద్భుతంగా నిర్మించిన 'వివేకానంద సెంటర్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స (వీసీహెచ్‌ఈ) ప్రారంభం కానుంది. ఎంతో మంది చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతూ పరిపూర్ణమైన చిన్నారులుగా మలచడంలో అహర్నిశలు శ్రమిస్తోన్న రామకృష్ణ మిషన్ వారికి అభినందనలు. మరిన్ని విజయాలను సాధిస్తూ ముందుకు సాగాలని మనసారా ఆకాంక్షిస్తూ...

**మంచిపగడం దేవదాస్**
**జర్నలిస్ట్, రామకృష్ణ మిషన్ స్కూల్ పేరెంట్**

# గ్రామాల్లో కూడా చెత్త ప్రాసెసింగ్ సెంటర్లు

## - ప్రాసెస్ చేసిన చెత్త రీసైక్లింగ్ సెంటర్ల వారు కొనుగోలు - చెత్త సేకరణకు కార్పొరేషన్ ద్వారా యంత్రాల కొనుగోలు - త్వరలో డంప్ యార్డ్ ఫ్రీ స్టేట్‌గా ఏపీ ఆకస్మిక తనిఖీలు చేయనున్న సీఎం - 'స్వచ్ఛ సంక్రాంతి- స్వచ్ఛ గ్రామ పంచాయతీ' సభలో పట్టాభిరామ్










**అమరావతి, (రాజధాని వార్తలు):** గ్రామాల్లో కూడా ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు, ప్రాసెస్ చేసిన చెత్తను రీసైక్లింగ్ సెంటర్ల వారు కొనుగోలు చేస్తారని, ఈ విధంగా గ్రామాలకు కొంత ఆదాయం సమకూరుతుందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. చెత్త నుంచి సంపద సృష్టించడం అనేది మనం చేసి చూపిస్తున్నామన్నారు. ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గం రావినూతల గ్రామంలో శుక్రవారం జరిగిన 'స్వచ్ఛ సంక్రాంతి- స్వచ్ఛ గ్రామ పంచాయతీ' సభలో ఆయన ప్రసంగించారు. సంక్రాంతి సందర్భంగా మన ఇళ్లను శుభ్రపరిచి, నూతన వస్త్రాలు ఎలా ధరిస్తామో, అలాగే గ్రామాలను కూడా శుభ్రపరిచి స్వచ్ఛంగా రూపొందించాలనే ఆలోచనతోనే 'స్వచ్ఛ సంక్రాంతి- స్వచ్ఛ గ్రామ పంచాయతీ' కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. 2025, జనవరి 25న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర ఉద్యమానికి నాంది పలికిన తర్వాత అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. మహానగరాలు, నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో చేపట్టవలసిన కార్యక్రమాలకు సంబంధించి ఒక ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళుతున్నామన్నారు. పట్టణాలలో బయోమైనింగ్ ద్వారా కొంతవరకు లెగసీ వేస్ట్‌ని క్లియర్ చేస్తున్నామని, ప్రాసెసింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

**గ్రామాలపై ప్రత్యేక దృష్టి**

ఇప్పుడు ప్రత్యేకంగా గ్రామాలపైన కూడా దృష్టిపెట్టినట్లు పట్టాభిరామ్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా తమకు అన్ని విధాల సహకరిస్తున్నట్లు చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ తరఫున పారిశుద్ధ్యానికి సంబంధించి అనేక రకాల యంత్రాలను కొనుగోలు చేసి, వాటి ద్వారా చెత్త సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలో 311 పుష్ కార్ట్స్ (చేతితో నెట్టే బండ్లు), 982 ట్రైసైకిల్స్, 13 ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్స్, 8 ఎలక్ట్రిక్ వెహికల్స్ కేటాయించినట్లు వివరించారు. ఒక్క రావినూతల గ్రామ పంచాయతీకే రూ.20 లక్షల విలువైన యంత్రాలను అందించనున్నట్లు తెలిపారు. ఈ యంత్రాల ద్వారా డోర్ టూ డోర్ వేస్ట్ సేకరణ మెరుగుపడాలన్నారు. తడిచెత్త, పొడి చెత్త వేరు చేయాలని చెప్పారు. పొడి చెత్తలోని ప్లాస్టిక్ కోసం ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్ మెంట్ యూనిట్ ఒకదానిని రావినూతల గ్రామంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. రావినూతల గ్రామానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని, అలాగే, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకు కూడా గ్రామస్తులు సహకరించాలని కోరారు.

**పట్టణాలలో 90 లక్షల టన్నుల చెత్త తొలగింపు**

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా ఇప్పటి వరకు చేసినది ఒక ఎత్తైతే, ఇకముందు చేయబోయేది చాలా ముఖ్యమైనదని, గ్రామాలలో మార్పు రావాలని అధికారులను ఉద్దేశించి చెప్పారు. గ్రామాలలో చిరకాలంగా పేరుకుపోయిన లెగసీ వేస్ట్‌ని, అలా వదిలేయకుండా తొలగించాలన్నారు. పట్టణాలలోని దాదాపు 90 లక్షల టన్నుల చెత్తని తొలగించామని చెప్పారు. గత పాలకులు చెత్తపై పన్ను వేయడమే కాకుండా, డంపింగ్ యార్డులలో టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోయే విధంగా చేశారన్నారు. ఆ చెత్తనంతా తొలగిస్తున్నట్లు చెప్పారు.

**త్వరలో డంప్ యార్డ్ ఫ్రీ స్టేట్‌గా ఏపీ**

రాష్ట్రంలో డంపింగ్ యార్డు కనిపించకుండా చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని, అందుకోసం ఆయన తమతో పని చేయిస్తున్నారన్నారు. డంప్ యార్డ్ ఫ్రీ స్టేట్‌గా త్వరలో రాష్ట్రం అవతరించబోతుందని చెప్పారు. గ్రామాలలో పేరుకుపోయిన చెత్తని కూడా దగ్గరలో ఉన్న బయో మైనింగ్ సెంటర్లకు తరలించే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా గ్రామాల ప్రజలు, అధికారులు కూడా పూర్తిగా సహకరించాలని కోరారు. అధికారులు ప్రభుత్వానికి సమర్పించే నివేదికల్లో మనల్ని మనం మోసం చేసుకోకుండా, ఉన్నవి ఉన్నట్లు వివరించమని కోరారు. ఏవైనా లోపాలు ఉన్నా తెలియజేయమని స్పష్టంగా చెప్పారు.

**త్వరలో సీఎం ఆకస్మిక తనిఖీలు**

సీఎం చంద్రబాబు త్వరలోనే గ్రామాలతో సహా ఆకస్మిక తనిఖీలు ప్రారంభించనున్నట్లు పట్టాభిరామ్ చెప్పారు. వేస్ట్ మేనేజమెంట్ ప్రాసెస్ ద్వారా మీరు ప్రాసెస్ చేసిన దానిని రీసైకిలర్స్ వచ్చి కొనుక్కొని తీసుకు వెళతారన్నారు. తాము ఇచ్చిన యంత్ర సామాగ్రిని పూర్తిగా వినియోగించుకోమని పారిశుధ్య సిబ్బందికి, ఇతర సిబ్బందికి చెప్పారు. తాము ఇచ్చినవి చాలకపోతే, మరికొన్ని అడగండని, సమకూరుస్తామని చెప్పారు. వాటిని వినియోగించకుండా కొత్త వాటిని అడగొద్దన్నారు.

**సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్ పరిశీలన**

చైర్మన్ పట్టాభిరామ్ తొలుత గ్రామంలోని ఎస్ డబ్ల్యూపీసీ (చెత్తను శుద్ధి చేసి సంపదగా మార్చే కేంద్రం)ను సందర్శించి, అక్కడ పనితీరును పరిశీలించారు. వర్కర్స్, సిబ్బంది, అధికారులను అడిగి అన్ని వివరాలు తెలుసుకున్నారు.

అక్కడ సిబ్బంది సమస్య లను అర్థం చేసుకుని, పరిష్కార మార్గాలు చెప్పారు.

అలాగే, గ్రామానికి రెండు ట్రై సైకిల్స్ ఇస్తామని, ప్రతి రోజూ ప్రతి ఇంటికి వెళ్లి వేస్ట్‌ని సేకరించి, తడిచెత్త, పొడిచెత్త వేరుచేయాలని వివరంగా చెప్పారు. ఏపీ మారిటోరియమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి పట్టాభిరామ్ ఇ-ఆటోని ప్రారంభించారు.

ఈ కార్యక్రమాల్లో ఒంగోలు డీడీఓ సీహెచ్ సువార్త, కొనిశపాడు ఎంపీడీఓ ఎంఆర్ రాజ్యలక్ష్మ, డిప్యూటీ ఎంపీడీఓ టీవై చంద్రసేన్, రావినూతల ఆర్‌ఎస్ సీఏ అధ్యక్షుడు కారుశాల నాగేశ్వరరావు (బాబు), సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామపెద్దలు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మన లక్ష్యం కావాలి

**- అధికారంలోకి వచ్చిన 19 నెలల్లో బుచ్చి పట్టణాభివృద్ధికి 9 కోట్ల 36 లక్షలతో కేటాయించాం - దాతలను ప్రోత్సహించి జిల్లాలో పి 4 ద్వారా తొలి అభివృద్ధి కార్యక్రమం చేపట్టింది బుచ్చి పట్టణంలోనే..- శంఖుస్థాపనలు చేసేసి అభివృద్ధి అని చెప్పుకోవడం కాదు, నిధులు సాధించి పనులు పూర్తి చేయాలి - త్వరలో బుచ్చి మున్సిపల్ కార్యాలయం, మార్కెట్ కాంప్లెక్స్ ప్రారంభించబోతున్నాం - ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నిత్యం ప్రజలలో వుంటూ ప్రజల వద్దకు పోయి ప్రజల సమస్యలు పరిష్కరించే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. బుచ్చిరెడ్డి పాళెం రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె 14, 15 వార్డుల ప్రజా విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ సమస్య చిన్నదైనా.. పెద్దదైనా పరిష్కరించడమే అధికారుల లక్ష్యం కావాలని సూచించారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికయినప్పటి నుంచి తన నివాసంలో నిత్యం గ్రీవెన్స్ జరుగుతుందని దాదాపు 75 శాతం సమస్యలు ఇంటి వద్దే పరిష్కారం అవుతున్నట్టు ఆమె పేర్కొన్నారు. అధికారంలోనికి వచ్చిన 19 నెలల్లో బుచ్చి పట్టణాభివృద్ధికి 9 కోట్ల 36 లక్షలతో కేటాయించామన్నారు. రోడ్లు డ్రైన్లు ఎక్కడ ఏది అవసరమో దశల వారీగా అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నామనన్నారు. ముఖ్యమంత్రి మానస పుత్రిక లాంటి పి4 కార్యక్రమాన్ని ప్రజల్లో తీసుకెళ్లి దాతలను ప్రోత్సహించి బుచ్చి పట్టణంలో మార్కెట్ కాంలెక్స్ నిర్మాణం చేపట్టిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. శిలాఫలకాలు వేయడం, టెంకాయలు కొట్టడం తప్ప అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి గత పాలకులకు లేదనన్నారు. గత ప్రభుత్వంలో శంఖుస్థాపనలు చేసి శిలా ఫలకాలు వేసి వదిలేసిన మైపాడు రోడ్డు, కొరుటూరు రోడ్లను తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక కాంట్రాక్టర్ మరియు సంబంధిత మంత్రులతో మాట్లాడి పూర్తి చేస్తున్న విషయాన్ని ఆమె వివరించారు. శంఖుస్థాపనలు చేసేసి అభివృద్ధి అని చెప్పుకోవడం తగదని వాటిని పూర్తి చేసినప్పుడే తాము చేశామని చెప్పుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రత్యర్థి పార్టీ నాయకులకు హితవు పలికారు. దశాబ్దాల తరబడి పాలకులు పట్టించుకోని కోవూరులోని పీటర్స్ కెనాల్ కల్వర్ట్ నిర్మాణం మరియు బాపన కాలువ ఆధునీకరణ పనులను ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో తాము తలపెట్టిన ఫైర్ స్టేషన్ నిర్మాణం, మలిదేవి కాలువపై బ్రిడ్జ్ నిర్మాణం కూడా మేమె చేసాం అని క్లెయిమ్ చేసుకోవడానికి చాలా మంది వస్తారని వ్యంగ్యోక్తి విసిరారు. ప్రజల సమస్యలను సానుభూతితో పరిశీలించి సానుకూల పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేసే వారే నిజమైన నాయకులని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్థానిక నాయకులకు హితోపదేశం చేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ కమీషనర్ డి బాలకృష్ణ, ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, వవ్వేరు బ్యాంక్ ఛైర్ పర్సన్ దొడ్ల విజయమ్మ, బుచ్చి కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఏటూరి శివరామకృష్ణ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు యారటపల్లి శివకుమార్ రెడ్డి, నస్రీన్ ఖాన్, 14వ వార్డు కౌన్సిలర్ చీర్ల ప్రసాద్, 15వ వార్డు ఇంచార్జి బండ్ల కొండయ్య, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎంవి శేషయ్య, మండల టిడిపి అధ్యక్షుడు గుత్తాశ్రీనివాసులు బిజెపి మరియు జనసేన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# పట్టాదార్ పాస్ బుక్స్‌పై రైతులకు అవగాహన కల్పించండి

**- పట్టాదార్ పాస్ పుస్తకాలపై వున్నక్యూ ఆర్ కోడ్‌తో రైతుల పేర్లు, భూమి విస్తీర్ణం ఇతర ఏదైనా ముద్రణా లోపాలు ఉంటే తెలుసుకొని సవరించుకోవచ్చు - రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు కల్లాల కోసం స్థలాలను గుర్తించండి - నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు ద్వారా చిన్న మధ్య పరిశ్రమలను ప్రోత్సహించి యువతకు ఉపాధి కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జోడించి క్యూ ఆర్‌తో రూపొందించిన పట్టాదార్ పాస్ బుక్స్ పై రెవెన్యూ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. నెల్లూరు నగరం మాగుంట లేఔట్‌లోని ఆమె నివాసంలో కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరు పేట, కోవూరు, విడవలూరు కొడవలూరు మరియు బుచ్చిరెడ్డి పాళెం తహసీల్దారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణి పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆమె మాట్లాడుతూ పట్టాదార్ పాస్ పుస్తకాలపై ముద్రించి వున్న క్యూ ఆర్ కోడ్ గురించి రైతులకు అర్ధమయ్యేల వివరించాలని కోరారు. పాస్ పుస్తకాలలో రైతుల పేర్లు, భూమి విస్తీర్ణం ఇతర ఏదైనా ముద్రణా లోపాలు ఉంటే క్యూ ఆర్ కోడ్ ద్వారా తెలుసుకొని సవరించుకోవచ్చున్న విషయాన్ని రైతులకు తెలపాలని తహసీల్దారులకు సూచించారు. రైతులకు ధాన్యం ఆరబెట్టుకునేందుకై కల్లాలు అవసరమని రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల వారీగా స్థల సేకరణ చేయాలని ఆదేశించారు. నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఇ పార్కు నెలకొల్పి చిన్న మధ్య మరియు సూక్ష్మ తరహా పరిశ్రమలను ప్రోత్సహించి యువతకు ఉపాధి కల్పించే దిశగా సిఎం చంద్రబాబు నాయుడు సమగ్ర ప్రణాళిక రూపొందించారన్నారు.

ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటుకు సంబంధించి స్థల సేకరణ మరియు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను గుర్తించి స్థానికంగా పరిశ్రమల ఏర్పాటుకు సహకరిం చవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరు పేట, కోవూరు, విడవలూరు కొడవలూరు మరియు బుచ్చిరెడ్డి పాళెం తహసీల్దారులు మురళి, వెంకట సుబ్బయ్య, చంద్రశేఖర్ స్ఫూర్తిరెడ్డి మరియు అంబటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఘనంగా సంక్రాంతి ముందస్తు వేడుకలు







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో విద్యార్థినీ విద్యార్థులు ఆకర్షణీయమైన ముగ్గులతో మంచి డాన్సులతో అలరించారు. పదో తరగతి విద్యార్థిని విద్యార్థులు కేకులు తీసుకొచ్చి పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మకాంతారావు చే కట్ చేయించి అందరికీ పంచడం జరిగింది. ఇందులో బోయ దాస్ శ్రీనివాసులు శ్రీధర్. సోమా పద్మా రత్నం. ప్రభావతి శైలజ. మృదుల. సరస్వతి. మరియు ప్రాథమిక పాఠశాల పిఎస్ హెచ్ఎం కరుణాకర్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ పాల్గొని పెద్దగా భోగి మంటను వేసి ఒకరికొకరు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల పి. ఈ.టి.శ్రీధర్ మరియు పి ఎస్ హెచ్ కరుణాకర్ ప్రత్యేకంగా నాగిని డాన్స్ ని వేసి అందరిని ఆకట్టుకున్నారు ప్రధానోపాధ్యాయులు లక్ష్మీకాంతరావు విద్యార్థినీ విద్యార్థులకు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు గ్రామస్తులకు అధికారులకు ప్రతి ఒక్కరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# 6675 కోట్లతో టాటా పవర్ ప్లాంట్ కేటాయించిన సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులోని ఇఫ్కో కిసాన్ సెజ్‌లో టాటా సంస్థ 6675 కోట్లతో పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయనుండటం హర్షించదగ్గ విషయమని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఇక్కడ పరిశ్రమను కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఏళ్లుగా ఎలాంటి పురోగతిలేని ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయని చెప్పారు. ఈ ప్లాంట్ ద్వారా దాదాపు 1000 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కనున్నాయని చెప్పారు. ఈ ప్రాంత పారిశ్రామిక పురోగతికి టాటా పవర్ ప్లాంట్ ఎంతో దోహదం చేస్తుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి పరిశ్రమలు తరలివస్తున్నాయని, ఇది సీఎం చంద్రబాబు నాయుడు పాలనా దక్షతకు నిదర్శనమన్నారు. దేశీయ సౌర పరికరాల తయారీ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు.. చైనా నుంచి దిగుమతి తగ్గించుకోవడానికి భారీ ప్రాజెక్టును ఏపీలో నెలకొల్పేందుకు టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ నిర్ణయం తీసుకోగా దేశంలోనే అతిపెద్దదైన 10 గిగావాట్ల సామర్థ్యం గల ఇంగాట్, వేఫర్ తయారీ ప్లాంట్‌గా ఇది నిలవనుందన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 200 ఎకరాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, మంత్రి నారా లోకేష్‌కి, కూటమి పెద్దలకు జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# కార్యకర్తల అభివృద్ధి బాధ్యత నాదే

**- సచివాలయ ప్రధాన, అనుబంధ కమిటీలు వేయండి - మళ్ళీ వచ్చేది మన వైసీపీ ప్రభుత్వమే - దక్షిణ సమన్వయ కమిటీలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వైసిపి పార్టీని బూత్ స్థాయిలో పూర్తిగా బలోపేతమయ్యే దిశగా కృషి చేయాలని, మీ బాధ్యత నేను తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే దక్షణ నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ వైసీపీ శ్రేణులకు సూచించారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ తో కలిసి ఆశీలమెట్ట కార్యాలయంలో శుక్రవారం దక్షణ వైసిపి శ్రేణుల సమన్వయ కమిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రధాన, అనుబంధ కమిటీలు వేయాలని వైసీపీ విశాఖ దక్షణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశించారు. ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి కార్యకర్తకు రెండు సెంట్ల భూమి, ఉద్యోగం ఇస్తానానని పేర్కొన్నారు. వచ్చేది వైసీపీ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. తెలుగు దేశం ఎమ్మెల్యేగా వున్నపుడు సైతం కార్యకర్తలకు ఇళ్ళు మంజూరు చేయించానని గుర్తు చేశారు.

ఒక్క ఫోన్ కాల్‌తో 10 వేల మంది కార్యకర్తలు వచ్చేలా నాయకులు కృషి చేయాలనీ పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో దక్షిణ వైసీపీ శ్రేణులు, కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మహిళా ఓటర్లకు సర్ ఘాతం!

మహిళలకు ఓటుహక్కు అనేది ఒకనాడు విప్లవాత్మక భావన. ఇప్పుడు అది మహిళల ప్రాథమిక మానవ హక్కుగా పరిగణిస్తున్నారు. భారతీయ సమాజంలో సమస్త రాజకీయ కార్యకలాపాలలో మహిళలు భాగస్వాములుగా ఉన్నారు. స్వతంత్ర భారత సార్వత్రిక ఎన్నికల చరిత్రలో 2019 ఎన్నికలు ఒక 'నిశ్శబ్ద విప్లవం'గా పేరుపొందాయి. ఆ సార్వత్రిక ఎన్నికలలో ఓటువేసిన వయోజనులలో పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. రాజకీయ క్రియాశీలురుగా భారతీయ మహిళలు ముందంజ వేస్తోన్న ప్రస్తుత తరుణంలో ఓటర్ జాబితాల నుంచి మహిళా ఓటర్ల పేర్లను పెద్ద ఎత్తున తొలగించారు, ఇంకా తొలగిస్తున్నారు. ఏమిటీ వైరు ధ్యం వట్టి వైరుధ్యం మాత్రమే కాదు, అది చాలా క్రూర వైరుధ్యం, సందేహం లేదు. 21వ శతాబ్ది మూడో దశకంలో ఇదెలా సంభవించింది? అని భావి చరిత్రకారులు తప్పక నివ్వెరపోతారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఇప్పటికే బిహార్‌లో ముగించిన, ప్రస్తుతం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో అమలుపరుస్తున్న ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో ఈ కఠోర వాస్తవం, క్రూర వైరుధ్యం చోటుచేసుకుంటోంది. రెండో దశ 'సర్'కు సంబంధించి ఉత్తరప్రదేశ్ మినహా, మిగతా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల గురించిన సమాచారం అందుబాటులో ఉన్నది. మహిళల భాగస్వామ్యంతో దశాబ్దాలుగా ఎన్నికలలో సాధించిన ప్రగతిశీల విజయాలు ఒక్కసారిగా తిరోగమనంలోకి మళ్లాయని ఆ సమాచారం విశదం చేస్తోంది. గత రెండు దశాబ్దాలుగా మహిళా ఓటర్ల నమోదులో గణనీయమైన మెరుగుదల, ఓటుహక్కు వినియోగించుకుంటున్న మహిళల సంఖ్యలో భారీ పెరుగుదల, మహిళా సమస్యలపై రాజకీయ పార్టీలు విశేష శ్రద్ధ చూపడం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ అద్భుత పురోగతిని పూర్తిగా వెనక్కినెట్టి, మహిళల ఓటింగ్ హక్కుల కోసం మళ్లీ ప్రాథమిక పోరాటం చేయవలసిన అగత్యం 'సర్'తో వాటిల్లనున్నది. భారతీయ మహిళా ఓటింగ్ ప్రభావశీలతకు చారిత్రకంగా రెండు అపకారాలు జరిగాయి, ఇంకా జరుగుతున్నాయి. వాటిలో ఒకటి ఆర్థికవేత్త, సామాజిక తాత్త్వికుడు అమర్త్యసేన్ గుర్తించిన 'తప్పిపోయిన ఆడపిల్ల' దృగ్విషయం. సహజ జనన రేటు ప్రకారం పుట్టవలసిన బాలికల సంఖ్య కంటే పుట్టిన బాలికల వాస్తవ సంఖ్య మధ్య పెద్ద వ్యత్యాసం ఉండడం. రెండోది ఓటుహక్కు ఉన్న మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉండడం. ఓటుహక్కుకు అర్హమైన వయస్సు వచ్చిన మహిళలు ఓటర్ జాబితాల్లో ఉండే అవకాశాలు పరిమితంగా ఉండడం. ఇప్పుడు 'సర్' కారణంగా భారతీయ మహిళలకు మూడో అపకారం వాటిల్లుతోంది. ఇప్పటికే ఓటర్ జాబితాలలో ఉన్న మహిళల పేర్లను పెద్ద ఎత్తున తొలగించడం, తొలగించనుండడమే ఈ మూడో అపకారం. పెద్ద ఎత్తున మహిళలు తమ ఓటుహక్కును కోల్పోవడమనేది స్వతంత్ర భారతదేశం ఇంతకు ముందెన్నడూ చూడలేదనడం ఎంతమాత్రం సత్యదూరం కాదు. సంభవించనున్న ఈ క్రూర పరిణామానికి సూచనలు బిహార్ 'సర్'లోనే స్పష్టంగా కనిపించాయి. 'సర్'కు ముందు బిహార్‌లో జెండర్ నిష్పత్తి (జనాభాలో పురుషుల సంఖ్యను స్త్రీల సంఖ్యతో పోల్చడం) ఇలా ఉంది: ప్రతి 1000 మంది పురుషులకు 932 మంది స్త్రీలు మాత్రమే ఉన్నారు. ఓటర్ల జాబితాలో ఈ నిష్పత్తి మరింత తక్కువగా ఉన్నది. ప్రతి 1000 మంది పురుష ఓటర్లకు మహిళా ఓటర్లు 914 మంది మాత్రమే ఉన్నారు. అంటే జనాభాలో తమ వాటా కంటే తక్కువగా ఉన్నారు. జనాభాలో ఉన్న వాటా ఓటర్ల జాబితాలో ప్రతిబింబించి ఉన్నట్టయితే మహిళా ఓటర్ల సంఖ్య 7 లక్షల మేరకు అధికంగా ఉండేది. 'సర్' అనంతరం బిహార్ ఓటర్ల తుది జాబితాలో జెండర్ నిష్పత్తి మరింతగా తగ్గిపోయింది. ప్రతి 1000 మంది పురుష ఓటర్లకు మహిళా ఓటర్లు 890 మంది మాత్రమే ఉన్నారు! మరింత స్పష్టంగా చెప్పాలంటే 'తప్పిపోయిన మహిళా ఓటర్ల' సంఖ్య 7 లక్షల నుంచి 16 లక్షలకు పెరిగింది. బిహార్‌లో ఒక దశాబ్ద కాలంలో జెండర్ నిష్పత్తిలో నమోదైన పెరుగుదల 'సర్'తో తుడిచిపెట్టుకుపోయింది. ఈ తిరోగతి, రాజకీయ భాగస్వామ్యంలో మహిళలు సాధించిన పురోగతి పూర్తిగా నిరర్థకమైపోవడమే కాదూ? బిహార్‌లో మహిళా ఓటర్ల నమోదులో అవకతవకలు జరిగాయని రెండో దశ 'సర్' సమాచారం ధ్రువీకరిస్తోంది. ఓటర్ల జాబితాలో జెండర్ నిష్పత్తి పడిపోయేందుకు 'సర్' దారితీసిందనేది స్పష్టం. 'సర్' ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు రెండో దశ ఆరు రాష్ట్రాల ఓటర్ల జాబితాలలో ప్రతి 1000 మంది పురుషులకు సగటున 979 మంది స్త్రీలు ఉన్నారు. వయోజన జనాభాలో మహిళాల వాటా 985. అంటే ఓటర్ల జాబితాలో స్త్రీల సంఖ్య కొంచెం తక్కువగా ఉన్నది. 'సర్' చూపిన ప్రభావం ఏమిటో చూద్దాం. ముసాయిదా ఓటర్ల జాబితాలో జెండర్ నిష్పత్తి 963కు తగ్గిపోయింది. అంటే ప్రతి 1000 మంది పురుష ఓటర్లకు 963 మంది స్త్రీ ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఈ నిష్పత్తిని సంఖ్యల్లోకి మార్చితే 'తప్పిపోయిన మహిళా ఓటర్లు' అదనంగా 23 లక్షల మంది ఉన్నారని విశదమవుతుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే 'సర్' తొలగింపులు పురుష, మహిళా ఓటర్ల విషయంలో సమరీతిలో ఉన్నట్టయితే ముసాయిదా ఓటర్ల జాబితాలో మహిళా ఓటర్ల సంఖ్య 23 లక్షల మేరకు అధికంగా ఉండేది. ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లకు సంబంధించి జెండర్ వారీగా సమాచారం ఇంకా అందుబాటులో లేదు. ఆ రాష్ట్రాల సమాచారాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే 'తప్పిపోయిన మహిళా ఓటర్ల' సంఖ్య, బహుశా మరింత అధికంగా ఉంటుందనడంలో సందేహం లేదు.

# పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పని చేస్తా : జి.వి.రవి రాజ్





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సమర్థవంతమైన నాయకత్వంలో అమలైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాహిత నిర్ణయాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జి.వి.రవి రాజు వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నూతనంగా నియమితులైన జి.వి.రవి రాజు శుక్రవారం విశాఖ మద్దిలపాలెం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ అధ్యక్షులు మరియు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో సేవలందించే అవకాశం కల్పించినందుకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అలాగే, రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షులు కె.రాజశేఖర్‌కి, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె. రాజుకి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు ఈ నియామకం మరింత ఉత్సాహాన్ని, ప్రేరణను కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. పార్టీ విధానాలు, సిద్ధాంతాలు, ప్రభుత్వ విజయాలను సమర్థవంతమైన ప్రచార వ్యూహాల ద్వారా ప్రజలకు చేరవేయడంలో ప్రచార విభాగం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ, బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రచార వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సోషల్ మీడియా, డిజిటల్ మీడియా, అలాగే సంప్రదాయ ప్రచార మార్గాలను సమర్థవంతంగా వినియోగించి పార్టీ సందేశాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లే దిశగా పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షులు కెకె రాజుని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు జీలకర్ర నాగేంద్ర, దల్లి రామకృష్ణ రెడ్డి, కోతకాల కుమార్, బోడేటి మహేష్, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి జోన్ అభివృద్ధికి ప్రాధాన్యతగా కార్యాచరణ

### - అనకాపల్లి జోన్ సమీక్షా సమావేశంలో వెల్లడించిన జీవీఎంసీ కమిషనర్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జోన్ అభివృద్ధికి ప్రాధాన్యత దిశగా కార్యాచరణ చేపట్టడం జరుగునని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. ఆయన జీవీఎంసీ అనకాపల్లి గుండాల జంక్షన్ వద్ద ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో అనకాపల్లి జోన్ అభివృద్ధి పనులు, సమస్యలపై అనకాపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, అనకాపల్లి జోన్ కార్పొరేటర్లు కొణతాల నీలిమ, మండపాటి సునీత,జాజుల ప్రసన్నలక్ష్మి, మాదంశెట్టి చిన్నతల్లి, జీవీఎంసీ ఉన్నత, విభాగాధికారులు, అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తిలతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సచివాలయం కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా అనకాపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ జీవీఎంసీలో పది జోనులుగా పునర్వ్యవస్థీకరించి వాటి అభివృద్ధి కొరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టడంతో పాటు ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లతో జోనల్ వారీగా సమీక్షలు నిర్వహించడం అభినందనీయమని, తక్కువ కాలంలో ఎన్నో వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టి అవలంబిస్తున్న జివిఎంసి కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ అనకాపల్లి నుండి విశాఖపట్నం చేరుకోవడానికి రెండు గంటలు సమయం పడుతుందని వాహనాలు రాకపోకలు, ప్రజలకు ఇబ్బందులు ప్రమాదాల గురవుతున్నందున రోడ్డు విస్తరణను చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థను, తాగునీటి సరఫ రాను మెరుగుపరచాలని, ఎస్‌టిపిని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచాలని, అంతర్గత కాలువలను ప్రధాన కాలువులకు అనుసంధానం చేయాలని, కాలువలలో పూడుకతీతలకు అవసరమగు మిషనరీని ఏర్పాటు చేయాలన్నారు. అనకాపల్లికి నాలుగు లక్షల కోట్లు ఇన్వెస్ట్మెంట్స్ వస్తున్నందున శాటిలైట్ టౌన్షిప్‌గా అభివృద్ధి చేయాలన్నారు. అన్ని మౌలిక సదుపాయాలతో రోడ్లు, జంక్షన్లు, వాకింగ్ ట్రాక్‌లు, పిల్లల పార్కులు, నెహ్రూ చౌక్, ప్రముఖులు విగ్రహాల ప్రాంతాలు అభివృద్ధిపరిచి సుందరీకరణ పనులతో అనకాపల్లికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలన్నారు. అనకాపల్లి ఏఎంసీ కాలనీ, అంజయ్య కాలనీ, విలీన ప్రాంతాలలో చాలా




ఆస్తులకు దస్తావేజులు లేనందున ప్రత్యేక కార్యాచరణ చేపట్టి పన్నులు విధించే ప్రక్రియ చేపట్టాలన్నారు. క్రీడలకు ప్రాధాన్యత నిస్తూ రాజీవ్ గాంధీ, ఎన్టీఆర్ స్టేడియం, గెస్ట్ హౌస్‌ను అభివృద్ధి పరచాలని, గార్బేజి ట్రాన్స్ఫర్ స్టేషన్, రైతు బజార్, వెండింగ్ జోన్ ఏర్పాటు చేయాలని, అనకాపల్లి ప్రధాన రోడ్డు, రింగ్ రోడ్డు, అంతర్గత రోడ్ల నుండి నేషనల్ హైవే వరకు, నూకంబిక దేవాలయం వరకు రోడ్లను అభివృద్ధిపరచాలన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ అన్ని జోన్లను అభివృద్ధిపరి చేలా ప్రభుత్వ సూచనల మేరకు పది జోన్లుగా పునర్వ్యవస్థీకరణ చేయడం జరిగిందని, అనకాపల్లి జోన్ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక కార్యాచరణ చేపడతామన్నారు.

ఈ జోనల్ సమీక్ష సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, డి.సి.ఆర్. ఎస్.శ్రీనివాసరావు, పట్టణ ప్రణాళిక అధికారి మీనా కుమారి, పర్యవేక్షణ ఇంజనీర్లు ఇంజనీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి.నరేష్ కుమార్, ఇంచార్జ్ డి.డి.హెచ్. వాసుకి, పి.డి. యుసిడి సరోజిని, పర్యవేక్షక ఇంజనీర్లు సంపత్ కుమార్, ఏడుకొండలు, గోవిందరావు, కే శ్రీనివాసరావు, పల్లంరాజు, ఎపిడి సంతోష్, సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ రవికుమార్, సహాయక వైద్యాధికారిని లక్ష్మి తులసి, కార్యనిర్వాహక ఇంజనీర్ శేఖర్, టిడ్కో హౌసింగ్ కార్యనిర్వాహక ఇంజనీర్, ఇతర జివిఎంసి అధికారులు, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎల్ మహా సంక్రాంతి వేడుకలు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్ నందు నిర్వహించబోతున్నటువంటి జీవీఎల్ మహా సంక్రాంతి వేడుకలకు భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీలో తను పూర్వ విద్యార్థిగా ఉన్నానని దానితో పాటు విశాఖపట్నంతో తనకి ఎనలేని అనుబంధం ఉన్నదని తెలియజేశారు ఆయన విద్యార్థి దశలో ఉన్న సందర్భంలో ఎమర్జెన్సీ సమయంలో 17 నెలల పాటు ఇక్కడే కారాగారంలో ఉన్నానని తెలియజేశారు. అంతటి అనుబంధ ఉన్నటువంటి ఆంధ్ర యూనివర్సిటీలో ఈరోజు సంక్రాంతి వేడుకలకు హాజరవ్వడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి వేడుకల్ని ప్రతి కుటుంబం ఎంతో ఘనంగా నిర్వహించుకోవాలని ప్రకృతిని ఆరాధించాలని రైతులని గౌరవించాలని, కుటుంబ విలువలని పాటించాలని, మాతృభాషని ప్రేమించాలని తెలియజేశారు. తెలుగు సంస్కృతి సాంప్రదాయాన్ని నేటి తరానికి పెద్దలు అలవాటు చేయాలని నేటి యువత ప్రాశ్చ్యాత్య సంస్కృతి వైపు ఆకర్షితులవుతున్నారని వారికి వంట పట్టించాలని మన సంస్కృతి సాంప్రదాయాలు, ఆధ్యాత్మికత విలువలు అలవాటు చేయాలని తెలియజేశారు. అలాగే మన ప్రధానమంత్రి పిలుపు మేరకు ఇంటింటా స్వదేశీ ప్రతి ఇంటా స్వదేశీ అనే నినాదంతో స్వదేశీ వస్తువుల వినియోగం పెరగాలని తద్వారా ఆత్మ నిర్భర భారత్ సంకల్పానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి బిజెపి ఫ్లోర్ లీడర్ ఉత్తర నియోజకవర్గం శాసన సభ్యులు పి.విష్ణుకుమార్ రాజు, విశాఖ వెస్ట్ ఎమ్మెల్యే పిజివిఆర్ నాయుడు(గణబాబు), కేయూ వైస్ ఛాన్సలర్ రాజశేఖర్, విశాఖ బిజెపి అధ్యక్షులు ఎంఎంఎన్ పరశురామరాజు రిటైర్డ్ ఐపీఎస్ ఆర్కే పశ్చినంద, ఎస్బిఐ డీజీఎం రాహుల్ పాల్గొన్నారు.

# పేదలకు చీరలు పంపిణీ

### - ప్రజల ఆశీస్సులతో 29వ వార్డులో కార్పొరేటర్ పట్టం కట్టాలి - పీతల వాసు జన్మదిన వేడుకలకు హాజరైన వాసుపల్లి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వచ్చే స్థానిక ఎన్నికలలో 29వ వార్డులో వైసీపీ జెండా ఎగురవేసి కార్పొరేటర్‌గా గెలవాలని పీతల వాసుకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆశీర్వచనాలు అందజేశారు. జిల్లా పరిషత్తు ప్రాంతంలో జరిగిన పీతల వాసు జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కటింగ్ చేయించారు. పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ దీవెనలు అందించారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ 29వ వార్డు అధ్యక్షుడిగా పీతల వాసు ప్రజలకు మరింత చేరువు కావాలని, ఆయన అందిస్తున్న సేవలు కార్పొరేటర్ స్థాయికి తీసుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, రాష్ట్ర యూత్ కార్యదర్శి కనకాల ఈశ్వరరావు, సిటీ యూత్ వింగ్ జనరల్ సెక్రెటరీ గుమ్మడి చంద్రమౌళి, అరుగుల రాజు, బేవార మహేష్, పడాల సూర్య, సంతోష్, శివ, 29వ వార్డు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే నూతన సంస్కరణలు




**ఒంగోలు, (రాజధాని వార్తలు):** ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే రెవెన్యూ వ్యవస్థలో ప్రభుత్వం సంస్కరణలు తీసుకు వస్తున్నదని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. క్షేత్రస్థాయి సేవల్లోనూ ఈ దిశగా స్పష్టమైన మార్పు కనిపించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఒంగోలులోని కలెక్టరేట్లో నిర్వహించిన ప్రకాశం, మార్కాపురం జిల్లాల రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు సంబంధిత అంశాలపై జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ వద్ద ఉన్న అధికారాలను డిఆర్‌ఓలకు, డివిజన్ లెవెల్ ఆఫీసర్ల వద్ద ఉన్న అధికారాలను తహసిల్దార్లకు ప్రభుత్వం బదలాయించిందన్నారు. ప్రజాప్రయోజన కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయ ఫలాలు క్షేత్రస్థాయిలో ప్రస్ఫుటంగా, నిష్పక్షపాతంగా కనిపించాలన్నారు. భూముల మ్యుటేషన్, ఆన్‌లైన్, సర్వే వంటి విషయాల్లో ప్రతి మండల పనితీరును ఇకపై క్షుణ్ణంగా సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ భూములను కాపాడే బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌లను సమర్ధంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇకపై ప్రతినెలా రెవెన్యూ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని తెలిపారు. ఫైళ్ళు అన్నీ ఆన్లైన్‌లోనే తనకు పంపించాలన్నారు. తహసిల్దార్లు అందరూ టూర్ డైరీ రిపోర్టులు తనకు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. విస్తృతంగా ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కా రంపై దృష్టి సారించాలని వారికి దిశానిర్దేశం చేశారు. మండల స్థాయి అధికా రుల పనితీరును డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, సబ్ కలెక్టర్ నిరం తరం గమనిస్తూ ఉండాలని కలెక్టర్ చెప్పారు. 22(ఏ) భూముల జాబితాలో చేర్పులు, తొలగింపుల కోసం ప్రభు త్వం నిర్దేశించిన నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. సబ్ డివిజన్ చేయటం, రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పాటించాల్సిన ప్రక్రియపైనా ఈ కార్యక్రమంలో అధికారులకు అవగాహన కల్పిం చారు. ఈనెల 11వ తేదీలోపు పట్టాదారు పాస్ పుస్తకాలన్నీ పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కాన్ఫరెన్స్లో డిఆర్‌ఓ బి.చినఓబులేసు, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, ఒంగోలు, అద్దంకి ఆర్డిఓ లక్ష్మి ప్రసన్న, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, మార్కాపురం ఇన్చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్ బాలాం జనేయులు, సర్వే శాఖ సహాయ సంచాలకులు గౌస్ బాషా, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, సబ్ రిజిస్ట్రా రులు, తహసిల్దార్లు, డిప్యూటీ తహసిల్దారులు, మండల సర్వేయర్లు, దేవాదాయ శాఖ ఈవోలు పాల్గొన్నారు. అనంతరం మార్కాపురం జిల్లాకు ఇన్చార్జిలుగా ఉన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓ లతోపాటు అద్దంకి ఇంచార్జ్ ఆర్డిఓ లక్ష్మి ప్రసన్న, కందుకూరు ఇంచార్జ్ సబ్ కలెక్టర్ నాగిరెడ్డి, మార్కాపురం ఇన్చార్జి సబ్ కలెక్టర్ శివరామి రెడ్డి, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డిలను ఈ సందర్భంగా ఏపీ రెవిన్యూ సర్వీసుల అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

# ఆ నారీ ఈ నారీ మధ్యలో..బ్యాచ్‌లర్ బకరా..!



యంగ్ టాలెంటెడ్ స్టార్ శర్వానంద్ నటిస్తున్న లేటెస్ట్ ఫ్యామిలీ ఫన్ రైడ్ 'నారీ నారీ నడుమ మురారి'. రామ్ అబ్బ రాజు దర్శకుడు. సంయుక్త మీనన్, సాక్షీ వైద్య హీరోయిన్ లుగా నటిస్తున్నారు. సుంకర రామబ్రహ్మం నిర్మిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సంక్రాంతి సందర్భంగా జనవరి 14న భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రీసెంట్‌గా విడుదలైన ట్రైలర్, లిరికల్ వీడియోలు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. సంక్రాంతి బరిలో పక్కా ఫ్యామిలీ ఫన్ రైడ్‌గా ప్రేక్షకుల అటెన్షన్‌ని గ్రాబ్ చేసింది. దీంతో సినిమాపై ఆడియన్స్‌లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. సంక్రాంతి సినిమాల్లో ప్రమోషన్స్ విషయంలో కాస్త వెనకబడ్డ 'నారీ నారీ నడుము మురారీ' టీమ్ సినిమా రిలీజ్‌కు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్ ని స్పీడప్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన లిరికల్ వీడియోలు ఆకట్టుకుంటుండటంతో తాజాగా టీమ్ మరో ఫన్నీ సాడ్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. ఆ నారీ ఈ నారీ నడుమ నే మురారీ..ఆ సారీ..ఈ సారీ.. చెరో పక్క చేరీ.. చంపుతున్నాయ్.. అదోటైపు మల్లి.. ఇదోటైపు లిల్లీ.. దొరికిపోయా..బ్యాచులర్ బకరాలాగ చితికి పోయా.. అంటూ సాగే ఫన్నీ సాడ్ సాంగ్‌ని రామజోగయ్య శాస్త్రి రాయగా, అరవింద్ ఆలపించాడు.. విశాల్ చంద్రశేఖర్ స్వరాలు అందించారు. సీరియస్ వేలో సాగుతూ ఫన్‌ని క్రియేట్ చేసేలా ఉంది. పాటలోని సాడ్‌నెస్‌ని ప్రజెంట్ చేస్తూనే రామజోగయ్య శాస్త్రి తన పదాలతో ఫన్‌ని కూడా అదే స్థాయిలో పండించారు. ఈ పాటలో శర్వా వేసినస్టెప్పులు కూడా ఆకట్టుకుంటున్నాయి. శర్వా తన పంథాకు పూర్తి భిన్నంగా పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో ఈ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకొస్తున్నాడు. సినిమాపై క్రియేట్ అయిన వైబ్ చూస్తుంటే ఈ సంక్రాంతికి శర్వా ఈ ఫన్ ఫ్యామిలీ డ్రామాతో కచ్చితంగా హిట్‌ని తన ఖాతాలో వేసుకోవడం ఖాయమని, మళ్లీ సక్సెస్ ట్రాక్‌లోకి వస్తాడనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ వారు నిర్మిస్తున్న ఈమూవీ చాలా రిచ్‌గా ఉంది. తాజా సాంగ్‌లోని విజువల్స్ పాటకు తగ్గట్టుగా ఉన్నాయి. ఇప్పటికే మంచి బజ్‌ని సొంతం చేసుకున్న ఈ మూవీ సంక్రాంతి బరిలోకి దిగుతోంది. ఇప్పటికే ప్రమోషన్స్ మొదలు పెట్టిన టీమ్ సినిమా ఫలితంపై ఫుల్ కాన్ఫిడెంట్‌తో ఉన్నారు. ఇదిలా ఉంటే మారుతి డైరెక్ట్ చేసిన 'మహానుభావుడు' తరువాత శర్వాకు ఒక్కటంటే ఒక్క హిట్టు రాలేదు. శర్వా హిట్టు మాట విని దాదాపు ఏళ్లవుతోంది. మధ్యలో శ్రీకారం, ఒకే ఒక జీవితం వంటి సినిమాలతో ఆకట్టుకున్నా కానీ అవి సూపర్ హిట్ అనిపించుకోలేకపోయాయి. గత కొన్నేళ్లుగా తన మార్కు సూపర్ హిట్ కోసం ఎదురు చూస్తున్న శర్వానంద్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న 'నారీ నారీ నడుమ మురారీ'తో హిట్‌ని తన ఖాతాలో వేసుకుంటాడని అంతా అంటున్నారు. ఈ మూవీతో పాటు శర్వా మరో రెండు క్రేజీ సినిమాల్లో నటిస్తున్నాడు. బైక్ రేస్ నేపథ్యంలో స్టైలిష్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న 'బైకర్', కొత్త తరహా కథతో రూపొందుతున్న 'భోగి' సినిమాలు చేస్తున్నాడు. ఈ రెండూ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

# ఫస్ట్ లుక్.. మహేష్ వైబ్స్‌తో ఘట్టమనేని జయకృష్ణ



సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మరో హీరో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి వస్తున్న విషయం తెలిసిందే. దివంగత రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్నారు. ప్రస్తుతం డెబ్యూ మూవీ శ్రీనివాస మంగాపురంతో బిజీగా ఉన్నారు. యాక్షన్ రొమాంటిక్ ఎంటర్టైనర్ గా అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తుండగా.. ప్రస్తుతం ఆ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తిరుపతి పక్కన ఉండే శ్రీనివాస మంగాపురంలో జరిగే కథతో సినిమా రూపొందుతోందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే సినిమాకు సంబంధించి మేకర్స్.. కాన్సెప్ట్ పోస్టర్ రిలీజ్ చేయగా మంచి రెస్పాన్స్ అందుకుంది. అందులో హీరో హీరోయిన్ ఇద్దరూ చేతులు పట్టుకొని చేతిలో గన్ ఉన్నట్టు చూపించారు. దీంతో సినిమాపై ఆడియన్స్‌లో ఆసక్తి క్రియేట్ అయింది. అయితే తాజాగా సినిమా నుంచి మరో అప్డేట్ వచ్చింది. రీసెంట్‌గా చెప్పినట్లు మేకర్స్.. జయకృష్ణ ఘట్టమనేని ఫస్ట్ లుక్‌ను రివీల్ చేశారు. జయకృష్ణ బాబాయ్, టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు విడుదల చేశారు. ఇప్పుడు జయకృష్ణ ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. అందరినీ ఆకట్టుకుని సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఫస్ట్ లుక్‌లో జయకృష్ణ బైక్‌పై వెళ్తూనే డేరింగ్ స్టంట్ చేస్తూ, గన్‌తో కాల్చుతున్నట్లు కనిపించారు. ఆయన కళ్లలో కసి, ముఖంలో కాన్ఫిడెన్స్ స్పష్టంగా కనిపిస్తుండగా.. మాస్ లుక్‌లో అదరగొట్టారు. అయితే పోస్టర్ యంగ్ మహేష్ బాబు, అలాగే లెజెండరీ సూపర్ స్టార్ కృష్ణ గారిని గుర్తుకు తెచ్చేలా ఉందని అనేక మంది అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. అదే సమయంలో కుటుంబ వారసత్వానికి తగ్గట్టుగా యాక్టింగ్ లో, యాక్షన్ లో జయకృష్ణ బాగా కష్టపడుతున్నట్లు ఫస్ట్ లుక్ ద్వారా క్లియర్‌గా తెలుస్తుందని అంటున్నారు.

అయితే దర్శకుడు అజయ్ భూపతి చాలా ఇంటెన్స్‌గా, రా అండ్ రగ్డ్ నెరేషన్‌తో జయకృష్ణ డెబ్యూ మూవీని తెరకెక్కిస్తున్నారని సమాచారం. యాక్షన్‌తో పాటు మంచి ప్రేమకథ కూడా సినిమాలో ఉంటుందని సమాచారం. శ్రీనివాస మంగాపురం మూవీతో బాలీవుడ్ నటి రవీనా టండన్ కుమార్తె రాషా తడానీ తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నారు. హీరోయిన్‌గా ఆమెకు ఇదే తొలి సినిమా కావడం విశేషం. ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ మ్యూజిక్ అందిస్తుండగా.. పి. కిరణ్ గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ చిత్రాన్ని సమర్పిస్తుండగా.. సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మరి ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.


# చీరకట్టులో సమంత సోయగాలు



సమంత.. టాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా భారీ పాపులారిటీ అందుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఇటీవల రెండవ వివాహం చేసుకొని కొత్త జీవితాన్ని మొదలుపెట్టింది. గత ఏడాది డిసెంబర్ 1న ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో ఈషా యోగ ఫౌండేషన్ సమీపంలో ఉన్న లింగ భైరవి సన్నిధిలో ఏడు అడుగులు వేసింది. వివాహం అనంతరం సినిమాలపై ఫోటోస్ పెట్టింది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే ఈమె తెలుగులో నటిస్తున్న చిత్రం మా ఇంటి బంగారం. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై సహ నిర్మాతగా వ్యవహరిస్తూ ఉండగా.. ఈ చిత్రానికి సమంత భర్త రాజ్ నిడిమోరు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ంశ్రీబనీ ఖీవజీట - ఆ ఫ్యామిలీమ్యాన్ ఈ ఫ్యామిలీమ్యాన్ ఒక్కరేనా? సమంతతో ఇదివరకే ఓ బేబీ సినిమా చేసిన డైరెక్టర్ నందిని రెడ్డి మరోసారి మా ఇంటి బంగారం అనే సినిమాకు దర్శకత్వం వహిస్తోంది. ఇక భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి జనవరి 9వ తేదీన ఈ సినిమా నుంచి టీజర్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో సమంత ఒకవైపు కోడలిగా అత్తవారి మెప్పు పొందడానికి ప్రయత్నం చేస్తూనే.. మరొకవైపు యాక్షన్ పర్ఫామెన్స్‌తో ఆకట్టుకుంది. ఈ టీజర్ ట్రైలర్ లాంచ్‌లో భాగంగా థియేటర్లో సందడి చేసిన ఈమె తాజాగా అందుకు సంబంధించిన ఫోటోలను ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. తెలుపు రంగు చీరకు గులాబీ వర్ణం కలిగిన బ్లౌజ్ ధరించి తన అందంతో మరింత ఆకట్టుకుంది. సింపుల్ జువెలరీతో తన మేకోవర్‌ను ఫుల్ ఫిల్ చేసిన ఈమె మరింత సింపుల్గా అభిమానుల హృదయాలను దోచుకుంది. సమంతాను చాలా రోజుల తర్వాత ఇలా సంతోషంగా ఉండడం చూసి మనసుకు హాయిగా ఉంది అంటూ అభిమానులు కూడా కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా సమంత మోములో స్వచ్ఛత అభిమానులనే కాదు నెటిజన్లను కూడా ఆకర్షిస్తోంది.ప్రస్తుతం సమంత షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. సమంత విషయానికి వస్తే.. ఒకప్పుడు టాలీవుడ్‌లో మహేష్ బాబు, అల్లు అర్జున్, రామ్ చరణ్, ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోలతో సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. కెరియర్ పీక్స్‌లో ఉండగానే నాగచైతన్యను ప్రేమించి పెళ్లి చేసుకుంది. కానీ ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో పెళ్లైన నాలుగేళ్లకే విడిపోయి అందరిని ఆశ్చర్యపరిచారు.

ఆ తర్వాత కాలంలో మయోసైటీస్ వ్యాధి బారిన పడి కొంతకాలం ఇండస్ట్రీకి కూడా దూరమయింది సమంత. ఇక తర్వాత తన ఆరోగ్యాన్ని చక్కబెట్టుకొని ఇప్పుడు మళ్ళీ వెబ్ సిరీస్‌లు సినిమాలు చేస్తూ బిజీగా మారిపోయింది. ఇకపోతే శుభం సినిమాతో తెలుగులో సినిమా తీసి నిర్మాతగా సక్సెస్ అందుకున్న ఈమె.. ఇలాగే ఒక వైపు హీరోయిన్గా మరొకవైపు నిర్మాతగా మరింత సక్సెస్ అవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# ఐశ్వర్యా డిఫరెంట్‌గా ట్రై చేస్తున్నట్టుందే!




ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షోతో యంగ్ హీరో తిరువీర్ బాక్సాఫీస్ వద్ద మంచి సక్సెస్‌ను అందుకున్నారు. అలాగే సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్ కూడా ఓ భారీ బ్లాక్ బస్టర్‌ను ఖాతాలో వేసుకున్నారు. ఇప్పుడు వీరిద్దరూ కలిసి ఓ పాన్ ఇండియా సినిమా చేస్తున్నారు. అదే ఓ.. సుకుమారీ. ఇవాళ ఐశ్వర్యా రాజేష్ బర్త్ డే సందర్భంగా మేకర్స్ ఈ సినిమాలో ఆమె లుక్‌ను రివీల్ చేస్తూ ఓ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. తిరువీర్, ఐశ్వర్యా జంటగా నటిస్తున్న ఈ సినిమాతో భరత్ దర్శన్ డైరెక్టర్‌గా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లో మహేశ్వర రెడ్డి మూలి ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇక రీసెంట్‌గా రిలీజ్ చేసిన పోస్టర్ చూస్తుంటే సినిమాలో ఐశ్వర్య పల్లెటూరి అమ్మాయి పాత్రలో కనిపించనున్నట్టు అర్థమవుతుంది. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో ఫుల్ లెంగ్త్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కనున్నట్టు తెలుస్తోంది. అయితే పోస్టర్‌లో ఐశ్వర్యా విలేజ్ లుక్స్ మాత్రమే కాకుండా ఆమె వెనుక ఊరిలోని జనమంతా పరిగెత్తడం కూడా చూపించారు. చూస్తుంటే సినిమాలో ఐశ్వర్య పాత్ర చాలా కొత్తగా ఉండనున్నట్టు తెలుస్తోంది. దామిని అనే సాంప్రదాయ యువతిగా ఐశ్వర్య లుక్‌ను మేకర్స్ ప్రెజెంట్ చేయగా, ఈ లుక్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. పోస్టర్‌ను బట్టి చూస్తుంటే సినిమా ఇంట్రెస్టింగ్ స్టోరీ లైన్‌తోనే తెరకెక్కుతున్నట్టు అనిపిస్తోంది. పోస్టర్ లో ఐశ్వర్య ఎక్స్‌ప్రెషన్స్ కూడా చాలా డిఫరెంట్‌గా కొత్తగా ఉన్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకు కుషేందర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాతో తెలుగుతో పాటూ తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# విశాఖ వేదికగా ఫిబ్రవరి 23న '9వ మిస్టర్ ఆంధ్ర' బాడీ బిల్డింగ్ పోటీలు





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని యువతలో శారీరక దృఢత్వం మరియు క్రీడల పట్ల ఆసక్తిని పెంచేందుకు ఏటా నిర్వహించే మిస్టర్ ఆంధ్రా పోటీలు ఈసారి 9వ వసంతంలోకి అడుగుపెట్టాయి. వచ్చే నెల 23న విశాఖలోని గురజాడ కళాక్షేత్రంలో జరగబోయే ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 జిల్లాల నుంచి 400 మంది బాడీ బిల్డర్లు పాల్గొంటారని అని ఏపీ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడపల్లి శ్రీనివాస్ రాజు తెలిపారు. విశాఖ వేదికగా వచ్చే నెల 23న శివ వైజాగ్ బౌన్సర్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు జరగనున్నాయి దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బీచ్ రోడ్డులో ఒక ప్రైవేట్ హోటల్లో జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన వాడపల్లి శ్రీనివాస్ రావు, అధ్యక్షులు ఈశ్వరరావులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ గురజాడ కళాక్షేత్రంలో సాయంత్రం 5 గంటల నుండి ఈ పోటీలు ప్రారంభమవుతాయని వారు వెల్లడించారు. ఈ మెగా ఈవెంట్‌లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొని తమ దేహదారుఢ్యాన్ని ప్రదర్శించనున్నారని తెలిపారు. మొత్తం 10 విభాగాలలో (ఈ పోటీలు నిర్వహించబడతాయి. ప్రతి విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేస్తారు మొదటి బహుమతి రూ. 5,000, ద్వితీయ బహుమతి రూ. 3,000, తృతీయ బహుమతి రూ. 2,000 చొప్పున అందజేస్తారన్నారు..అన్ని విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని 'ఓవరాల్ ఛాంపియన్‌లుగా ఎంపిక అయిన వారికీ మొదటి బహుమతిగా రూ. 1,00,000, (ఒక లక్ష రూపాయలు) రెండవ బహుమతి రూ 50,000, మూడవ బహుమతి: రూ. 25,000 అందజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణలో అసోసియేషన్ ప్రతినిధులు ఎస్. రాజారావు, బి.కోటిరెడ్డి, ఎస్.బాబి తదితరులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శివ వైజాగ్ బౌన్సర్ ఫౌండర్ శివ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు బాడీ బిల్డింగ్ రంగానికి గుర్తింపు తీసుకు వచ్చేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ఏపీ వ్యాప్తంగా ఉన్న బాడీ బిల్డర్స్ పాల్గొనాలని క్రీడాభిమానులు అందరూ తరలివచ్చి ఈ పోటీలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా బాడీ బిల్డింగ్ విన్యాసాలు ప్రదర్శించారు.

# వైజాగ్ ఈస్ట్ ఈజ్ బెస్ట్ : ప్రియాంక దండి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రముఖ తెలుగు దిన పత్రికలో విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఉన్న గొప్ప తనం గురించి చాలా చక్కని కథనం వచ్చిందని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి తెలిపారు. అభివృద్ధి చెందడానికి జిల్లాలో ఏ నియోజకవర్గనికి లేని అవకాశం విశాఖ తూర్పుకి ఉందని, గతంలో కాంగ్రెస్ పాలకులు గుర్తించి మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ వుడా చైర్మన్ ద్రోణంరాజు హయాంలో ఈరోజు సెటిలైట్ సిటీగా, దేశంలోనే అతి పెద్ద కాలనీగా గుర్తింపు తెచ్చుకున్న ఎంవీపీ కాలనీ ఏర్పాటు చేసారు. ఆరిలోవ విమ్స్, హెల్త్ సిటీ, హనుమత్ వాక నుండి సింహాచలం వరకు బి ఆర్ టి ఎస్ రోడ్డు స్వర్గీయ వై ఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అయింది, ప్రైవేట్ రంగ సంస్థలు ఏర్పడిన అది కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఫలితంగా కొనసాగింపుగా వచ్చినవే. అడవివరంలో నిర్మిస్తున్న రైల్వేజోన్ హెడ్ క్వార్టర్ కూడ విభజన హామీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందే, ఆ తరువాత నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది, సుదీర్ఘ సాగరతీరం తూర్పు నియోజకవర్గం పరిధిలో ఉన్న, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కోస్టల్ కారిడోర్ ప్రకటించిన స్థానిక శాసనసభ్యుడు ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోవడంలో విఫలమయ్యారని, మత్స్యకారను తాయిలాలతో, ప్రభుత్వ పథకాలతో మభ్యపెడుతున్నాడు తప్పా వారి జీవితాల్లో మార్పు తీసుకువచ్చే ప్రయత్నం చెయ్యట్లేదు. కొత్త ప్రాజెక్టలు లేవు ప్రస్తుత శాసనసభ్యులు వెలగపుడి రామకృష్ణ బాబు విద్యావంతుడు కాకపోవడం, అభివృద్ధిపై అవగాహన లేకపోవడం, నియోజకవర్గాన్ని అభివృద్ధి చెయ్యాలనే బలమైన సంకల్పం లేకపోవడం, విశాఖ తూర్పు నియోజకవర్గానికి 11 ఏళ్లుగా గ్రహణం పట్టిందని ప్రియాంక ఆరోపించారు.

# రక్తదానం ప్రాణదానమే : గుమ్మలూరు విశాలాక్షి

**విజయనగరం, (రాజధాని వార్తలు):** రక్తదానం ప్రాణదానమేనని నా ఊరు విజయనగరం వ్యవస్థాపకులు గుమ్మలూరు విశాలాక్ష పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు, నైతిక విలువల నిలువుటద్దం యూఏ నరసింహం స్మారకర్థం ఎన్ వి ఎన్ బ్లడ్ బ్యాంక్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లతో కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షలు సముద్రాల గురు ప్రసాద్ .రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ రక్తాన్ని దానం చేసి మరొకరు ప్రాణాలు కాపాడవచ్చునని, రోగ నివారణ కోసం, ప్రమాదాల సమయంలో, ఇతర విపత్కర ఆరోగ్య పరిస్థితుల్లో బాధితుల శరీరంలో రక్తం తగినంతగా లేకపోతే మరొకరి నుంచి రక్తాన్ని ఎక్కిస్తారు. ఈ విధంగా ఒకటి రక్తం మరొకరికి ఇచ్చే విధానమే రక్తదానం.



అన్ని దానాలలోను రక్తదానం ప్రత్యేకమైనది అని ఈ విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ రక్తదాన శిబిరంలో ఎన్ వి ఎన్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ తాడేపల్లి నాగేశ్వరరావు, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పి దుర్గాప్రసాద్, ముడిదాపు రాము, ఉపాధ్యాయిని పారుపూడి మంజుల తదితరులు పాల్గొన్నారు.

# ఉదారత చాటుకున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

## - వైసీపీ కార్యాలయ హౌస్ కీపింగ్ సిబ్బందికి రూ. 11 వేలు ఆర్థిక సాయం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం జిల్లా వైసీపీ పార్టీ కార్యాలయ హౌస్ కీపింగ్ సిబ్బందికి పండుగ ఖర్చులకు గానూ 11,000 /- లు అందజేసి మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ తన ఉదారత మరోసారి చాటుకున్నారు. దక్షిణ పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం జిల్లా పార్టీ కార్యాలయంలో పనిచేస్తున్న కుమార్, స్వర్ణలతలకు సొంత నిధులతో సాయం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర ప్రజలు పెద్ద పండగ అయినా సంక్రాంతి అందరి ఇంట వెలుగులు నింపాలని ఆకాంక్షంచారు. పార్టీ కార్యాలయంలో వైసిపి కుటుంబంలో భాగస్వాములైన హౌస్ కీపింగ్ సిబ్బంది అందిస్తున్న సేవలు కూడా ఎంతో కీలకమన్నారు. పార్టీ శ్రేణులకు, కార్యాలయానికి అవసరమైన వసతులు కల్పిస్తూ శుభ్రం చేసే కార్మికులు మంచి చెడ్డలు చూడటం తమ బాధ్యత అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో జిల్లా పార్టీ అధ్యక్షలు కేకే రాజు అధ్యక్షతన విశాఖలో సంక్రాంతి సంబరాలు ప్రతి వైసిపి కుటుంబ సభ్యుడుతో పాటు మన కోసం పనిచేసే సిబ్బంది కూడా సంతోషంగా ఆనందంగా జరుపుకోవాలన్నదే తమ ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లండ రమణ, అరుగుల రాజు చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

## - భారీ వర్షాలకు జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజల సహాయార్థం కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. ఆగ్నేయ బంగాళాఖాతము, దాని సమీప తూర్పు భారత మహాసముద్ర ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండం మారిన కారణంగా ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నెల్లూరు జిల్లాకు చిన్నపాటి నుంచి మోస్తరు వర్షాలు చెల్లాచెదురుగా కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల నుండి వచ్చే ఫోన్ కాల్స్ స్వీకరించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టుటకు కంట్రోల్ రూమ్‌లో షిఫ్టులవారీగా కలెక్టరేట్ సిబ్బందిని నియమించినట్లు ఆయన తెలిపారు. ప్రజలందరూ అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం కంట్రోల్ రూమ్ నెంబర్లు 0861-2331261 / 7995576699 /1077 లలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

# పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ త్వరగా పూర్తి చేయాలి

## - క్షేత్రస్థాయిలో ఏవైనా సాంకేతిక లేదా ఇతర సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించి రైతులకు పాస్ పుస్తకాలు అందజేయాలి : జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశం

**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయం నుండి జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శనివారం సాయంత్రానికి జిల్లావ్యాప్తంగా కనీసం 80 శాతం పాసుపుస్తకాల పంపిణీ లక్ష్యన్ని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రెవెన్యూ డివిజన్ల వారీగా పంపిణీ పురోగతిని సమీక్షంచిన కలెక్టర్, క్షత్రస్థాయిలో ఏవైనా సాంకేతిక లేదా ఇతర సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి రైతులకు పుస్తకాలు అందేలా చూడాలన్నారు. జాయింట్ కలెక్టర్ సేథు మాధవన్ ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రైతులందరికీ పారదర్శకంగా, వేగంగా పాసు పుస్తకాలు అందజేయడంలో తహసీల్దార్లు చొరవ చూపాలని, నిర్దేశించిన గడువులోగా పని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సేథు మాధవన్, ఆర్డీవోలు కీర్తి, సత్యవాణి, రామ్మోహన్ మరియు జిల్లాలోని వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొని, తమ పరిధిలో జరుగుతున్న పంపిణీ వివరాలను కలెక్టర్‌కు వివరించారు.



# ఆర్యవైశ్య నిరుపేదలకు కుసుమంచి ఫౌండేషన్ వితరణ



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరంలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న కుసుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమంచి సుబ్బారావు ఆధ్వర్యంలో ఉల్లి వీధి ఆర్యవైశ్య భవనంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆర్యవైశ్య నిరుపేదలకు వస్త్రాల వితరణ గావించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కాపుగంటి శ్రీనివాస్, విశిష్ట అతిథులుగా హాజరైన వెత్సా శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించడమే కాక జిల్లా కేంద్రంలో ఎటువంటి సేవ చేసేందుకైనా తానున్నానని ముందుకు వస్తూ కుసుమంచి. సుబ్బారావు స్ఫూర్తిదాయకంగా నిలిచారని అన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షలు సముద్రాల గురు ప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలోఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏడుకొండలు, వాసవి ఫౌండేషన్ అధ్యక్షలు ఎం.వి.ఆర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సుమారు 200 మందికి కుసుమంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వస్త్రాలు వితరణ గావించారు.

# పాఠశాలల్లో వేడుకగా "సంక్రాంతి సంబరాలు"





**గజపతినగరం, (రాజధాని వార్తలు):**మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు వేడుకగా జరిగాయి. పదో తేదీ నుంచి సంక్రాంతి సెలవులు కావడంతో శుక్రవారం దాదాపు అన్ని పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు ముగ్గురు పోటీలు నిర్వహించగా, ఉత్తమ రంగ వల్లులు ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. అలాగే భోగి మంట వెలిగించి, మంట చుట్టూ సాంప్రదాయకమైన నృత్య ప్రదర్శన విద్యార్థినిలు చేశారు.

పలు సంక్రాంతి, భోగి పాటలకు విద్యార్థినీలు చేసిన నృత్య ప్రదర్శన, కోలాటం ఆకట్టుతుంది.

# బాలాజీ నగర్ నారాయణ స్కూల్‌లో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని బాలాజీ నగర్‌లో ఉన్న నారాయణ స్కూల్‌లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరానంటాయి. స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు సంక్రాంతి విశిష్టతను తెలియజేస్తూ వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వందన రెడ్డి మాట్లాడుతూ మన దేశ సంస్కృతి సాంప్రదాయాలను కొనసాగిస్తూ విద్యార్థులకు పండుగలు యొక్క గొప్పతనాన్ని వివరించడం జరిగిందన్నారు. సంక్రాంతి వంటి సంప్రదాయ పండుగలను పాఠశాలలో జరుపుకోవడం ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలపై అవగాహన పెరుగుతుందని అన్నారు. చదువుతో పాటు సంస్కృతి కూడా విద్యలో భాగమేనని ఆమె తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, రంగవల్లులు, భోగి మంటలు, సంప్రదాయ వేషధారణ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాలల డీన్ నరేంద్ర రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, ఏవో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# స్టోన్ హౌస్ పేట నారాయణలో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నగరంలోని స్టోన్ హౌస్ పేట, నారాయణ స్కూల్‌లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో, పండుగ వాతావరణంలో ముందస్తు సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగ ప్రిన్సిపాల్ పెంచల ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల పండుగ వాతావరణంతో కళకళలాడిందని ఆయన తెలిపారు. సంక్రాంతి వంటి సంప్రదాయ పండుగలను పాఠశాల స్థాయిలో జరుపుకోవడం ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలపై అవగాహన పెరుగుతుందని అన్నారు. చదువుతో పాటు సంస్కృతి కూడా విద్యలో భాగమేనని ఆయన స్పష్టం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, రంగవల్లులు, భోగి మంటలు, సంప్రదాయ వేషధారణ అందరినీ ఆకట్టుకున్నాయని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, జట్టు భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అకాడమిక్ డీన్ రషీద్ ‌ఖా, ప్రభాకర్ మాట్లాడుతూ, పండుగల ద్వారా విద్యార్థులకు జీవిత విలువలు, సామాజిక బాధ్యత, కుటుంబ వ్యవస్థ ప్రాముఖ్యతను తెలియజేయవచ్చని అన్నారు. విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో, ఆనందంగా పాల్గొనడం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు, పాటలు, సంక్రాంతి విశిష్టతను వివరించే ప్రదర్శనలు నిర్వహించగా, ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా సహకరించారు. మొత్తం కార్యక్రమం విజయవంతంగా సాగడంతో పాఠశాల యాజమాన్యం సంతృప్తి వ్యక్తం చేసింది.

# కోవూరు నియోజకవర్గం ఇండస్ట్రియల్ హబ్‌గా మారనుంది

**- ఇఫ్కో కిసాన్ సెజ్‌లో టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యంలో 6 వేల 675 కోట్లతో 10 గిగావాట్ల సామర్థ్యం గల ఇంగాట్, వేఫర్ తయారీ ప్లాంట్ ఏర్పాటు - టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్‌కు 200 ఎకరాల భూకేటాయింపు - సోలార్ సెల్స్, సెమీకండక్టర్ చిప్స్ తయారీ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 1000 మందికి అనుబంధ పరిశ్రమల ద్వారా మరో 3 వేల మందికి ఉపాధి అవకాశాలు - ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి లోకేష్‌లకు ధన్యవాదాలు - కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గ యువతకు ఉపాధి కల్పించాలన్న తన లక్ష్యం ఇఫ్కో కిసాన్ సెజ్‌లో టాటా సోలార్ సెల్స్, సెమీ కండక్టర్ చిప్స్ తయారీ ప్లాంట్ ఏర్పాటుతో సాకారం అవుతోందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. కొడవలూరు మండలం చంద్రశేఖర పురంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టాటా పవర్‌కు 200 ఎకరాల భూకేటాయింపు నిర్ణయం పట్ల ఆమె ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సోలార్ సెల్స్, సెమీకండక్టర్ చిప్స్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు కోవూరు నియోజకవర్గంలోని ఇఫ్కో కిసాన్ సెజ్ అనుకూల ప్రాంతమని టాటా గ్రూప్ ను ఒప్పించడం వెనుక ఐటీ మంత్రి నారా లోకేష్ కృషి వుందన్నారు. టాటా గ్రూప్ ద్వారా కోవూరు నియోజకవర్గంలో భారీ పరిశ్రమ స్థాపనకు కృషి చేసిన సిఎం చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి లోకేష్‌లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమలులోకి తీసుకు వచ్చిన తర్వాత పలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పరిశ్రమలు పెట్టేందుకు ఏపీకి క్యూ కడుతున్నాయన్నారు. టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యంలో 6వేల 675 కోట్లతో 10 గిగావాట్ల సామర్థ్యం గల ఇంగాట్, వేఫర్ తయారీ ప్లాంట్‌ను ఇఫ్కో కిసాన్ కిసాన్ సెజ్‌లో ఏర్పాటుతో ప్రత్యక్షంగా 1,000 మందికి అనుబంధ పరిశ్రమల ద్వారా మరో 3 వేల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయనన్నారు. ఢిల్లీలోని ఇఫ్కో అధికారులతో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పలు సార్లు కలిసి ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమల స్థాపనకు సంబంధించి చర్చించిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గుర్తు చేస్తూ ఈ సందర్భంగా ఆమె ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# జిల్లా కేంద్ర కారాగారానికి హోం మంత్రి అనిత

**- నెల్లూరు సెంట్రల్ జైలుని ఆకస్మికంగా తనిఖీ చేసిన హోం మంత్రి అనిత - జైలులో ఖైదీల వసతులు పరిశీలన, భోజనాలు తనిఖీ - ఖైదీలతో మాటామంతి - వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్న అనిత**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు సెంట్రల్ జైలులో అధికారులు పనితీరు బాగుంది. జైలులో ఉన్న ఖైదీలు పలు రకాల ప్రోడక్ట్స్ తయారు చేస్తున్నారు. గత ప్రభుత్వం జైళ్లు, ఫైర్ శాఖల్లో నియామకాలు చేపట్టలేదు. అందుకే ఎక్కువ ఖాళీలు ఉన్నాయి. త్వరలోనే నియామకాలు చేపడుతాం. రౌడీ మూకల ఆట కట్టించాం. రప్పా... రప్పా... బ్యాచ్‌లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకి పాల్పడితే చర్యలు తప్పవు. నెల్లూరు పోలీసుల పనితీరు బాగుంది.. రౌడీయిజాన్ని రూపుమాపేందుకు చర్యలు.

# నెల్లూరు నగరంలో నూతనంగా ఉడిపి ఉపహార్ హోటలు ప్రారంభోత్సవం





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు షేక్ రియాజ్ మరియు వారి మిత్రులు నెల్లూరు నగరం మంగుంట లే అవుట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఉడిపి ఉపహార్ రెస్టారెంట్‌ను శాసన మండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు బీద రవిచంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీలతో కలసి ప్రారంభించారు.


# యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**- గాంధీ బొమ్మ వద్ద వైసిపి యువజన విద్యార్థి వామపక్ష విద్యార్థి సంఘాల బైఠాయింపు - పోలీసుల అరెస్టులు**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్‌లో లికూటమి ప్రభుత్వం నిరుద్యోగులు, యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలతో కలిసి వైఎస్ఆర్సిపి యువజన, విద్యార్థి, వామపక్ష పార్టీ నేతలు గాంధీ బొమ్మ వద్ద శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, యువతకు జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్‌లు అమలు చేస్తామని చెప్పి నేడు అవేమీ పట్టనట్టు వ్యవహరించడం దుర్మార్గం అన్నారు. జిల్లా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ఆశ్రిత్ రెడ్డి, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చీదేళ్ల కిషన్ నగర యువజన విభాగం అధ్యక్షులు దీపు, యస్థాని, యువజన విభాగం నాయకులు రోషన్, హేమంత్, నగర విద్యార్థి విభాగం అధ్యక్షులు చంద్ర రెడ్డి, తౌఫిక్‌తో పాటు ఇతర విద్యార్థి సంఘాల నేతలు రోడ్డెక్కి నిరసనకు దిగారు. నిరసన దీక్ష చేపడుతున్న యువజన విద్యార్థి విభాగం నేతలను పోలీసులు అడ్డుకోవడంతో ఇదేంటని ప్రశ్నించిన యువజన విద్యార్థి విభాగం నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# సిఆర్ఎం టీచర్స్ డైరీ క్యాలెండర్లను ఆవిష్కరించిన ఎంఇఓ కిల్లా వెంకటేశ్వర్లు

**డక్కిలి (రాజధాని వార్తలు):** డక్కిలి మండల విద్యా కార్యాలయం వద్ద నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో సిఆర్ఎం టీచర్స్ డైరీ మరియు క్యాలెండర్లను ఆవిష్కరణ చేస్తున్న డక్కిలి మండల విద్యా అధికారి కిల్లా వెంకటేశ్వర్లు మరియు సిఆర్ఎం టీచర్స్ యన్.బి.రమేష్, జగదీశ్వరయ్య, అనిత, అంజమ్మ, రవీంద్ర డేటా ఎంట్రీ ఆపరేటర్ సురేష్, మెసెంజర్ కోటయ్య పాల్గొన్నారు.



# RAJADHANI CLASSIFIEDS Ad. Call

9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మీ సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM

9440662699


# శ్రీ విద్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

## - ముగ్గుల పోటీలలో పాల్గొన్న తల్లులు



**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో శ్రీ విద్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ముందుగానే నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులలో వచ్చి ముగ్గులతో పాఠశాల ఆవరణలో నింపారు. పిల్లలు పతంగులు ఎగురవేశారు. అనంతరం ప్రైమరి, ప్రీ ప్రైమరి విద్యార్థుల తల్లులకి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో తల్లులు ఎంతో సంతోషంగా పాల్గొని ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం 6వ వార్డు మెంబెర్ అబ్బినేని వినీలా రాణి పాల్గొన్నారు. అనంతరం ముగ్గుల పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ గెలుపొందిన శ్రీలక్ష్మి, రమ్యశ్రీ, సుభాషిణి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు మెంబెర్ బొంత రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్సి, జోనల్ ఇంచార్జి సాయి కృష్ణ, ఏ జి ఏం రవీంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల ఉదారత - అనాధ పిల్లలకు ఆర్థిక సహాయం





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని ఉపాధ్యా యులు తమ ఉదార స్వభావాన్ని మరో మారు చాటుకున్నారు. ఇటీవలే జామి మండలంలోని హైస్కూల్లో చదువుకుంటున్న అనాధ పిల్లలకు 20 వేల రూపాయలు సాయం చేసిన మండల ఉపాధ్యాయులు, శుక్రవారం పురిటిపెంట న్యూకాలనీలో గల ఇద్దరు అనాధ విద్యార్థులకు నగదు, బట్టల రూపేణా 13 వేల రూపాయలు సహాయం చేశారు. తాము సేకరించిన 13 వేల రూపాయల్లో 3000 రూపాయలు విలువచేసే బట్టలు అందజేయగా, జి.యోగేంద్ర అనే విద్యార్థికి ఏడువేల రూపాయలు, టీ.మానసకు 3000 రూపాయలు ఆర్థిక సహాయం కూడా చేశారు. ఈ దుస్తులు, నగదును మండల విద్యాశాఖ అధికారిని ఎస్.విమలమ్మ చేతుల మీదుగా అనాధ పిల్లలకు అందజేశారు. ఉపాధ్యాయుల ఉదారతను ఎం.ఈ.ఓ ఎస్.విమలమ్మ అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు, సిఆర్పిలు పాల్గొన్నారు.

# శ్రీ ఆదిత్య స్కూల్‌లో ముందుగా అంబరాన్ని అంటిన సంక్రాంతి ఉత్సవాలు





**ఎటపాక, (రాజధాని వార్తలు):** తోటపల్లి గ్రామంలో శ్రీ ఆదిత్య స్కూల్ నందు సంక్రాంతి ఉత్సవాలలో సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబిచేలా జరుపుకునే పండుగ సంక్రాంతి అని, అన్నదాత కష్టాన్ని దేవుడు దీవించి ఇచిన ఫలితమే సంక్రాంతి వెలుగులను శ్రీ ఆదిత్య స్కూల్ కరెస్పాండెంట్ కడియాల వెంకట్ ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మ పేర్కొన్నారు. ఎటపాక మండలం తోటపల్లి శ్రీ ఆదిత్య స్కూల్ ఆవరణంలో శుక్రవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో అతిధులుగా సుజాత, చంద్రిక, చైతన్య ప్రసాద్ హాజరయ్యారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణంలో పల్లెటూరి వాతావరణం ఉట్టిపడేలా సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబిచేలా అన్నీ రకాల ఏర్పాట్లు చేశారు. హరి దాసుల వేషధారణలో విద్యార్థులు అందరిని అలరించారు. ఇసుర్రాయి, రోలు, రోకలి, ఎడ్ల బండి, పెరుగు చిలికే కవ్వం ఇతరత్ర అన్ని కళ్ళకు కట్టేలా ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇలా ఉండటం వల్ల వేడుకలు వీక్షంచేందుకు వచ్చిన తల్లిదండ్రులకు అవగాహన కలిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రాధారణతో ఘనంగా భోగిమంటలు వేసి సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. తొలుత విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు వైవిధ్యంగా ముగ్గులు వేసి సంక్రాంతి పండుగ విశిష్ఠత తెలిసేలా వివరించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ…నేటి సమాజంలో ఆచార సంప్రదాయాలపై అవగాహన కొరవడుతోందని, అందుకే విద్యార్థులకు ఈ పండుగలపై మరింత ఆసక్తి పెరిగేలా ప్రత్యేక కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ మల్లికా, శ్రీనివాసరావు, సంధ్య ప్రసన్న, జ్యోత్స్న, అప్పాజీ నాగేశ్వరరావు, వరలక్ష్మ నాగేంద్రమ్మ నమ్రత రమాదేవి శివాని శ్రీనివాస్, వాసవి ఇమాన్షి, జయంతి, వాసవి, శివదేవి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర సుజల ప్రవంతి ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ వేగంగా జరగాలి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్ర సుజల శ్రవంతి ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూ సేకరణ వేగంగా జరగాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కాంప్ కార్యాలయంలో భూసేకరణపై రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమీక్షంచారు.

సుజల శ్రవంతి ప్రాజెక్ట్‌కు సేకరిస్తున్న భూమి గ్రామం వారీగా, సర్వే నెంబర్ వారీగా ప్రభుత్వ భూమి, డి పట్టా, అసైన్డ్ భూమి వివరాలను సమగ్రంగా వెంటనే సమర్పించాలని ఆదేశించారు. అలినేషన్ ప్రతిపాదనలు వారంలోగా పంపాలని తెలిపారు. ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు సమన్వయంతో పని చేసి పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు.

ఈ సమావేశంలో జేసీ సేదు మాధవన్, ఆర్.డి.ఓలు కీర్తి, సత్యవాణి, ఎస్.డీసీ కళావతి, తహశీల్దార్లు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan